విశాలాంధ్ర

వైయస్ఆర్ కడప జిల్లా | అన్నమయ్య జిల్లా

శుక్రవారం 27, సెప్టెంబర్ 2024 8 పేజీలు

రాష్ట్ర స్థాయి పోటీలకు సుండుపల్లె విద్యార్థులు

విశాలాంధ్ర - సుండుపల్లె : మండల కేంద్రమైన సుండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలు ఎస్ జి ఎఫ్ ఐ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయినట్లు ఫిజికల్ డైరెక్టర్ రాధారాణి తెలిపారు.గురువారం కడప జిల్లాలోని గండి గురుకుల పాఠశాల లో జరిగిన ఎస్ జి ఎఫ్ ఐ అండర్ 14, అండర్ 17 బాలికల విభాగంలో రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకోసం ఉమ్మడి కడప జిల్లా జట్టు ఎంపికలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఎంపికలలో సుండుపల్లె ఉన్నత పాఠశాల నుంచి అండర్ 17 బాలికల విభాగంలో ఎం వాణి, అండర్ 14విభాగంలో సి గగన, అల్పిష, అఫీఫా,నవ్య లత లు తమ ప్రతిభను చాటుకునీ సెలెక్టర్ల దృష్టనీ ఆకర్షించారు. దీంతో ఉమ్మడి కడప జిల్లా అండర్ 17, అండర్ 14విభాగాల సెలెక్టర్లు ఐదు మంది బాలికలను వుమ్మడి కడప జిల్లా జట్టు కు ఎంపిక చేసినట్లు ప్రకటించారని సెలెక్షన్లకు బాలికలను తీసుకువెళ్ళిన పి డి రాధా రాణి తెలిపారు.దీంతో పాఠశాల ప్రధానో పాధ్యాయులు జయన్న ,ఉపాధ్యాయులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయిన బాలికలతో పాటు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లను అభినందించారు.

పక్కా గృహాల నిర్మాణాలలో...

లక్ష్యాలను పూర్తి చేయాలి

జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్

విశాలాంధ్ర-రాయచోటి : ఎన్టీఆర్ హౌసింగ్ ఇళ్ల నిర్మాణాల లో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు అన్ని మండలాల ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు, హౌసింగ్, ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, డిఆర్డిఏ, నీటిపారు దల, జిఎస్డబ్ల్యూఎస్, తదితర శాఖల జిల్లా అధికారులతో, హౌసింగ్ ఏఈలతో ఎన్టీఆర్ హౌసింగ్ పథకం కింద ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ కలెక్టర్లు, ఆర్డిఓ, మండల ప్రత్యేక అధికారులు అన్ని మండలాలలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాల ప్రక్రియపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించి పురోగతిని తీసుకురావాలన్నారు. ఎన్టీఆర్ హౌసింగ్ ఇళ్ల నిర్మాణాల ప్రక్రియలో ఈ సంవత్సరం డిసెంబర్ 31 నాటికి నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి అధికారులు అందరూ సమన్వయంతో కృషి చేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు ఈ పథకంపై ప్రత్యేక శ్రద్ధ చూపి, మంచి పురోగతి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 28న జరగబోయే "మన ఇల్లు - మన గౌరవం" కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పెద్ద లేఅవుట్ లకు కేటా యించిన ప్రత్యేక అధికారులు ప్రత్యేక అధికారులు మరియు హౌసింగ్ శాఖ అధికారులు లబ్ధిదారులందరికీ అవగాహన కల్పిం చి ఇల్లు కట్టుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఈ సమా వేశంలో రాజంపేట సబ్ కలెక్టర్ నైదియా దేవి, హౌసింగ్ శాఖ పిడి శివయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

పోలీస్ సంక్షేమానికి ప్రాధాన్యత

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల ముగింపు కార్యక్రమంలో ఎస్పీ

విశాలాంధ్ర-కడప : మహిళా పోలీస్ సిబ్బంది, వారి కుటుంబాలలోని మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ద వహించాలని, సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని జిల్లా ఎస్.పి వి.హర్షవర్ధన్ రాజు సూచించారు. గురువారం సాయంత్రం స్థానిక ఉమేష్ చంద్ర కల్యాణమండపంలో మూడు రోజులుగా విజయవాడ మణిపాల్ హాస్పిటల్స్ సహకారంతో ఏర్పాటు చేసిన రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ ఉచిత స్క్రీనింగ్ పరీక్షల ముగింపు కార్యక్రమానికి జిల్లా ఎస్.పి ముఖ్య అతిధిగా విచ్చేసారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్.పి మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోందన్నారు. విధుల్లో నిమగ్నమై సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోలేని సిబ్బంది మెడికల్ క్యాంపు లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గత నెలలో పోలీస్ సిబ్బందికి జిల్లా కేంద్రంలోని పోలీస్ సంక్షేమ ఆస్పత్రిలో ఉచిత వైద్య పరీక్షల శిబిరం ఏర్పాటు చేశామని, ముమ్ముందు మరిన్ని మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామని జిల్లా ఎస్.పి గారు తెలిపారు. క్యాంప్ ఏర్పాటుకు సహకరించిన మణిపాల్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డా.సుధాకర్ కంటిపూడికి, రేడియేషనల్ ఆంకాలజిస్ట్ స్పెషలిస్ట్ వైద్యులు డా. శ్రీదివ్య, రామ్ చక్రవర్తి, సిబ్బందికి, విజయవంతమయ్యేలా చేసిన పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్.పి పేరు పేరునా అభినందించారు. క్యాంప్ ఏర్పాటుకు, విజయవంతమయ్యేలా కృషి చేసిన ఏ.ఆర్ అదనపు ఎస్.పి ఎస్.ఎస్.వి కృష్ణారావుని, అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్ బాబుని, పోలీస్ సంక్షేమ ఆస్పత్రి వైద్యురాలు డా.మేరీ సుజాత, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, మహిళా ఎస్.ఐ లు పావని, నస్రీన్, మహిళా కానిస్టేబుళ్లు లక్ష్మీదేవి, మాధవీలత, కృష్ణవేణి లను జిల్లా ఎస్.పి అభినందించారు. క్యాంప్ నిర్వహణకు సహకరించిన మణిపాల్ ఆస్పత్రి సిబ్బంది జిల్లా ఎస్.పి వి.హర్షవర్ధన్ రాజు ఐ.పి.ఎస్ జ్ఞాపికలు అందచేశారు.క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించే 'బ్లూ బస్' ను జిల్లా ఎస్.పి సందర్శించి అందులోని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరికరాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్.పి (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు , అదనపు ఎస్.పి (ఏ.ఆర్) ఎస్.ఎస్.వి కృష్ణారావు, పోలీస్ సంక్షేమ ఆస్పత్రి వైద్యులు డా. మేరీ సుజాత, ఏ.ఆర్ డి.ఎస్.పి మురళీధర్, ఆర్.ఐ లు ఆనంద్, టైటస్, వీరేష్, శ్రీశైల రెడ్డి, ఆర్.ఎస్.ఐలు, మహిళా పోలీసు సిబ్బంది,హోమ్ గార్డులు, డి.పి.ఓ సిబ్బంది, వారి కుటుంబాలకు చెందిన మహిళలు ఉన్నారు.

రైతు వ్యధ వినేందుకు పద !

వారానికి 2 రోజులు క్షేత్రస్థాయిలో అధికారులు- అధిక దిగుబడుల సాధనకు ఆసరా

విశాలాంధ్ర-యర్రగుంట్ల : గత వైకాపా ప్రభుత్వ పాలనలో రైతులకు రాయితీపై పరికరాల పంపిణీ ఎత్తేశారు. వరిలో ముడి జింక్ నుంచి నారుకు విత్తనాల వరకు సరఫరా ఆపేశారు. భూసార పరీక్షలు మానేశారు. చివరికి పండించిన పంటను అమ్ముకోవడానికి స్వేచ్ఛ లేకుండా చేసేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వ్యవసాయంపై దృష్టి సారించింది. అన్నదాతలకు ఆసరాగా నిలవడానికి శాస్త్రవేత్తలు, వ్యవసాయ, ఉద్యాన, సేంద్రీయ, మార్కెటింగ్శాఖ అధికారుల బృందాన్ని పొలంగట్టుకే పంపిస్తోంది. పొలంపిలుస్తోంది పేరిట ప్రతి మంగ్ల, బుధవారాల్లో అధికార యంత్రాంగం రైతుల దగ్గరకే వెళ్లేలా రూపొందించిన కార్యక్రమం ఈ నెల 24న ఎర్రగుంట్ల మండలం లో కూడా ఆరంభమైంది. వాతావరణం అనుకూలించక అన్న దాతలకు సాగు భారంగా మారింది. ఈ క్రమంలో రైతులను నూతన విధానాల వైపు మళ్లించి సాగు వ్యయం తగ్గించి ఆశించిన ఫలితాలను సాధించడమే పొలం పిలుస్తోంది లక్ష్యం. ఇందుకోసం ప్రాంతాల వారీగా అవసరమైన సూచనలు చేయడం, భూసార పరీక్షలు నిర్వహించేలా ప్రోత్సహించడం ఆయాశాఖల అధికారు లు చేయాల్సి ఉంది. ఎరువుల వాడకం, మందుల పిచికారికి కిసాన్ డ్రోన్లను వినియోగించడం, కౌలు రైతు కార్డులు మంజూ రు, రైతు మిత్ర సంఘాల ఏర్పాటు వంటి విషయాలపై రైతులను చైతన్యపరుస్తారు. ఖరీఫ్, రబీ పంట కాలంలో నాలుగు నెలల పాటు జరిగే ఈ కార్యక్రమం ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు కొనసాగనుంది.

నిధుల కేటాయింపు: పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహణ నిమిత్తం ప్రభుత్వం నిధులు కూడా కేటాయించింది. దీనిపై వ్యవసాయశాఖకు

-5లో

కలెక్టరేట్ ప్రాంగణంలో స్వచ్ఛతహి సేవా కార్యక్రమం

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : పరిసరాలను.పరిశుభ్రంగా పచ్చదనంతో నింపాలని, కార్యాలయాలను సొంత నివాసాల్లా.. అత్యంత పరిశుభ్రంగా ఉంచుకోవలన్న జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి మాటలను.. తూచా తప్పక పాటిస్తూ.. కలెక్టరేట్ ప్రాంగణంలో అన్ని శాఖల అధికారులు వారివారిబ్లాకుల వద్ద "స్వచ్ఛతాహి సేవా" కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పిలుపు మేరకు, జిల్లా కలెక్టర్ ఆదేశాలతో.. "స్వచ్ఛతాహీ సేవా" కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలోని పరిసరాలన్నింటిని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది స్వచ్ఛందంగా పార, పలుగు పట్టి పిచ్చిమొక్కలను తొలగించారు. దీంతో కలెక్టరేట్

-5లో

మిట్స్‌లో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం

విశాలాంధ్ర-మదనపల్లె: మదనపల్లి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ & సైన్స్ కళాశాల నందు యెన్.ఎస్.ఎస్ విద్యార్థులు 'స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు కలశాల లో పరిసరాల పరిశుభ్రతతో కలశాల లోని చెత్త ను శుభ్రం చేసినారు. ఈ కార్యకమం లో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.కమల్ బాషా మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ కార్యక్రమానికి మరింత ఊపునిస్తూ.. పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా మన దేశ ప్రధాని నరేంద్ర మోదీ 'స్వచ్ఛత హీసేవ ఉద్యమా నికి శ్రీకారం చుట్టారనారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛత ఉద్యమంలో భాగం పంచుకోవాలని, ప్రతి గ్రామం, వీధి, పట్టణం, పరిసరాలు అంతటా స్వచ్ఛతను పాటించాలని మనమంతా కలిసి బాపు కలలను సాకారం చేద్దామని విద్యార్థులకు పిలుపునిచ్చారు.పరిసరాల శుభ్రత లేకుండా ప్రజలు ఆరోగ్యంగా ఉండటం సాధ్యం కాదని, స్వచ్ఛ భారత్ ఉద్యమాన్ని మరింతగా ముందుకు తీసుకెళ్లడం ద్వారా రోగాల వ్యాప్తిని అరికట్టవచ్చని చెప్పారు. కార్యక్రమం లో యెన్.ఎస్.ఎస్ కో ఆర్డినేటర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆటల పోటీలలో సత్తా చాటిన విజ్ డమ్ విద్యార్థులు

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : నియోజకవర్గ స్థాయిలో హెూరాహెూరీగా జరిగిన ఆటల పోటీలలో విజ్ డమ్ సిబిఎస్ఇ విద్యార్దిని విద్యార్దులు పాల్గొని సత్తా చాటారు.ప్రతిభ కనబర్చి ఘన విజయం సాధించి జిల్లా స్థాయికి ఎంకయ్యారని విజ్ డమ్ విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ టి ప్రదీప్ గురువారం పాత్రికేయులకు తెలిపారు.అండర్ -17 జిల్లా స్థాయి కబడ్డి జుట్టుకు విష్ణు, ఖోఖో విభాగంలో గుణచరణ్,బ్యాడ్ మెంటన్ కు రాహుల్, అండర్ -14 విభాగంలో లీలావెంకట్,బ్యాడ్ మెంటన్ మరియు వాలీబాల్ జుట్టుకు అలాగే అండర్ 17 ఖోఖో బాలికల జిల్లా జట్టు కు మధులత ఎంపికైనారు.బాలికల 200 మీటర్లు పరుగు పందెంలో వేద రెండవ స్థానం,400 మీటర్లు విహారిక మూడవ స్థానం,400 మీటర్లు బాలుర విభాగంలో జశ్వంత్ మూడవ స్థానం,షాట్ పుట్ విభాగంలో సంజన్ నియోజకవర్గ స్థాయిలో రెండవ స్థానం సాధించారు.ఘన విజయం సాధించిన విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయులను విజ్ డమ్ విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ టి ప్రదీప్, అడ్మిన్ డైరెక్టర్ టి మదన్ మోహన్, ప్రిన్సిపాల్ టి ప్రియాంక అబినందించి సత్కరించారు.విజ్ డమ్ సిబిఎస్ఇ విద్యార్దులు ప్రభంజనం సృష్టించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ డమ్ సిబిఎస్ఇ స్కూల్ క్రమశిక్షణ పట్ల ప్రశంసలు కురిపించారు.

చిన్నపిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-గాలివీడు: చిన్నపిల్లలపై అఘాయిత్యాల పట్ల ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ప్రధానోపాధ్యాలు బి.దుర్గేశ్వర్ రాజు పేర్కొన్నారు. గురువారం స్థానిక జిల్లాపరిషత్ బాలికోన్న పాత శాలలో రెడ్స్ సంస్థ ఆధ్వర్యంలో సమా జంలో చిన్నపిల్లలపై జరుగు తున్న అఘాయిత్యాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా సీ ఎస్ డబ్ల్యూ భారతి మాట్లాడుతూ ప్రస్తుత సమా జంలో చిన్న పిల్లలపై అఘాయిత్యాలు మరియు బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. అంతేగాక తల్లిదండ్రుల నిరక్షరాస్యత కారణంగా చాలామంది పిల్లలు బాల కార్మికులు కూడా మారుతున్నారన్నారు. బాల్యవివాహాలను అరికట్టేందుకు వివాహ కనీస వయస్సు స్త్రీలకు 18 సంవత్సరాలు, పురుషులకు 21 సంవత్సరాలు నిండాలన్న విషయాన్ని ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు.చదువుకునే సమయంలో ఎక్కడైనా బాల్యవివాహాలకు పాల్పడితే అధికారులకు,ఉపాధ్యాయులకు లేదా 1098 నెంబర్ కి ఫోన్ చేసి ఫిర్యాదు చెయ్యలన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని,ఉపాధ్యాయులు రమణయ్య,ఫైరోజా, నిర్మల, షబానా,తదితరులు పాల్గొన్నారు.

హమాలీ కార్మికులకు కూలీ రేట్లు పెంచాలి

విశాలాంధ్ర-కడప రూరల్ : పెరుగుతున్న నిత్యవసర ధరలకు అనుగుణంగా సివిల్ సప్లయ్ లో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు కూలీరేట్లు పెంచాలని ఎగమతులు దిగుమతులకు క్వింటాకు 35 రూపాయలు ఇవ్వాలని సివిల్ సప్లై అధికారులు తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కేసీ.బాదుల్లా డిమాండ్ చేశారు. గురువారం కడపలో మార్కెట్ యార్డులోని సివిల్ సప్లయ్ గోదాం వద్ద రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధ్బంగా వారు మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు మారినా హమాలీ కార్మికుల బతుకులు మారడం లేదనీ ఆవేదన వ్యక్తంచేశారు. ప్రతి రోజూ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు, హాస్టళ్లకు, మధ్యాహ్న భోజనం నిర్వ హించే పాఠశాలలకు, అంగన్వాడీ కేంద్రాలకు నిత్యావసర సరుకులను చేరవేయ డంలో వీరి పాత్ర కీలకమని చెప్పారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి హమాలీ రేట్ల ఒప్పందం జరుగుతుం దనీ, గతంలో చేసిన ఒప్పంద గడువు 2023 డిసెంబర్‌తో ముగిసిందని గుర్తుచేశారు. నూతన రేట్ల ఒప్పందం 2024 జనవరి ఒకటి నుంచి అమలు చేయాల్సి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు కె.వెంకట రమణ,ప్రతాఫ్ రాజశేఖర్ ,నాగన్న, రామ్మోహన్ ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కె.లింగన్న పాల్గొన్నారు.

ఇది మంచి ప్రభుత్వం -ప్రజలు మెచ్చిన ప్రభుత్వం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు మండల పరిధి లోని కామనూరు గ్రామం నందు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అధికారుల తో కలిసి వివరించారు. అనంతరం నిర్వహించిన ప్రజా వేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇది ప్రజా ప్రభుత్వం అని కేవలం 100రోజుల్లోనే రాష్ట్రంలో ఐదు రూపాయలకే భోజనం అన్నా క్యాంటీన్లు, పెన్షన్ పెంపు, మెగా డీఎస్సీపై తొలి సంతకం చేశామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్ర మంలో నాయకులు నంద్యాల హనుమంత్ రెడ్డి, సర్పంచ్, మాజీ సర్పంచ్, పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: పట్టణంలోని స్థానిక లింగాపురం వద్ద గల రాయలసీమ వ్యాయామ విద్యా కళాశాలలో కొత్తగా అడుగుపెట్టిన 2024-26 బ్యాచ్ విద్యార్థులకు కళాశాల గురించి ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి చదువుకోవడం కోసం వచ్చిన విధ్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రవిశంకర్ మాట్లాడుతూ గత 40సంవత్సరములుగా రాయలసీమ కాలేజ్ అన్ని వసతులతోటి, డాక్టరేట్ పొందిన అధ్యాపకుల చేత మంచి నాణ్యమైన విద్యను అందిస్తున్నదని, విధ్యార్థులు అధ్యాపకుల మంచి బోధనను, క్రీడా మైదానాలను, గ్రంథాలయంను సరిగ్గా ఉపయోగించుకోవాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో ఓరియంటేషన్ ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ ఏ.శంకర్ రెడ్డి మాట్ణాడుతూ క్రమశిక్షణ, అంకితభావంతో కాలేజ్‌లో వ్యాయామ విద్యను అభ్యసించాలని తెలిపారు. ఇందులో కాలేజ్ అధ్యాపకులు,

సంక్షేమంలో చరిత్ర సృష్టించిన చంద్రబాబు

విశాలాంధ్ర - రైల్వేకోడూరు: రాష్ట్రంలో ప్రజా రంజకంగా వంద రోజుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు.ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ సంక్షేమంలో చరిత్ర సృష్టించారని తెలుగు దేశంపార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ముక్కా రూపానందరెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ కొనియా డారు.గురువారం కోడూరు టౌన్‌లోని రాజ్ కన్వెన్షన్‌లో రూపానందరెడ్డి అద్వర్యంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం ప్రజా దర్బార్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రసంగించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన 100 రోజులలో వివిధ సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల నుంచి ఇది మంచి ప్రభుత్వం అని ప్రజల నోటి నుండి వచ్చిందన్నారు. నియోజకవర్గాన్ని మోడ ల్ నియోజకవర్గంగా తీర్చి దిద్దుతామన్నారు. ప్రజల నుండి వినతులు స్వీకరించారు.ఈ కార్యక్రమం లో,ఎండిఓ జాషువా,ఆర్డబ్ల్యూఎస్ డిఇఇ ఎం మహేశ్వర,ఎఇ మణి ,కూట మి నాయకులు ముక్కా సాయి వికాస్ రెడ్డి, తాతం శెట్టి నాగేం ద్ర, కట్టా గుండ య్య నాయుడు, బత్తిన వేణు గోపాల్ రెడ్డి, కాలవ రవీం ద్ర, సింగమాల మల్లిఖార్జున రెడ్డి, కట్టా బాలాజీ, సంగరాజు రవికుమా ర్ రాజు,జి వెంకటేశ్వర రాజు, నీలకంఠయ్య, జోగినేని మణి, సర్పంచ్ కారుమంచి సంయుక్త,కల్లా చలపతి, నార్జాల హేమరాజ్, బత్తిన ఆనంద్ యాదవ్, పోతురాజు నవీన్,లాల్ భాష, అరవింద్, తిరుపతి శేఖర్, కొమ్మా శివ, సుబ్బరామిరెడ్డి, మెహతాజ్ బేగం, సాలవ రమణరాజు, రాజుకుంట సర్పంచ్ గుత్తి నరసింహులు తదితరులు పాల్గొన్నారు. రాఘవరాజు పురం పంచాయితీలోని టిడిపి కార్యాల యం నుంచి రూపానందరెడ్డి అద్వర్యంలో పండుగ వాతావరణం లో బాణాసంచా పేలుస్తూ పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టా రు. వచ్చిన కూటమి నాయకులను, కార్యకర్తలను, మహిళలను అదుపు చేయడం సాధ్యం కాలేదు.

ఉపాధ్యాయుడి దాతృత్వం

విశాలాంధ్ర-గాలివీడు: ప్రభుత్వ ఉపాధ్యాయుడు బుక్కపట్నం సుబ్బారాయుడు 185 భోజనం ప్లేట్లు విద్యార్థులకు పంచిపెట్టి తన దాతృత్వం చాటుకున్నాడు.గురువారం మండలంలోని గాండ్లపల్లి, గాలివీడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఫిజిక్స్ ఉపాధ్యాయుడు బుక్కపట్నం సుబ్బారాయుడు తన సొంత నిధులతో భోజనం ప్లేట్లు ఇవ్వడంతో పాటు విందు భోజనాన్ని ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమనికి ముఖ్య అతిథిలుగా హాజరైన వైస్ ఎంపీపీ మిట్టపల్లి యదుభూషన్ రెడ్డి,సర్పంచ్ లక్షిదేవమ్మ,విద్యాధికారులు నాగరాజు, శ్రీనువాసులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే నిరుపేద విద్యార్థుల అవసరాలను తీర్చేందుకు దాతలు ముందుకు వచ్చేలా ప్రేరణ కలిగిస్తూ తాను పనిచేస్తున్న పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయుడు సుబ్బారాయుడు భోజనం ప్లేట్లు పంపిణీ చెయ్యడం అభినందనీ యమన్నారు. ఈకార్య క్రమంలో ప్రధానోపా ధ్యాలు మోహిద్దీన్, ఉపాధ్యాయులు, విద్యా ర్థులు పాల్గొన్నారు.

దివ్యాంగ సర్టిఫికెట్ల పరిశీలన

విశాలాంధ్ర-కొండాపురం: జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల అభివృద్ధి అధికారి నాగప్రసాద్ ఆధ్వర్యంలో కొండాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణం నందు జిల్లా దివ్యాంగ శాఖ వారు దివ్యాంగ శిబిరం ఏర్పాటు చేయడమైనది. ఈ శిబిరం నందు దివ్యాంగుల యొక్క వికలాంగ నిర్ధారణ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు పరిశీలించి అవసరమైన వారికి కావలసిన కృత్రిమ కాళ్లు, చేతులు, ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాలు అందజేయనున్నట్లు అధికారులు తెలియజేశారు. ఈ శిబిరం నందు మండల వ్యాప్తంగా 76మందికి అవసరమైన పరికరాలు తొందర్లో వారికి అందజేయడం జరుగుతుందని నాగప్రసాద్ పేర్కొన్నారు. శిబిరం నందు తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ నాగేశ్వర్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారులు ఓబులేసు, రామయ్య, తెలుగుదేశం పార్టీ నాయకులు బాలనాగిరెడ్డి, అంకిరెడ్డి పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

చెట్టిధనంజయ తండ్రి లేట్ సి.వెంకటముని, ఇంటి నెం.16-106-75-A, గంగారపు లేఅవుట్, రోజా ప్లాట్స్, కమ్మగడ్డ ఎక్స్‌టెన్షన్, H/o కమ్మపల్లి, మదనపల్లి టౌన్ & మండలం, అన్నమయ్యజిల్లా. నేను ఇంటి దగ్గరనుండి ఎపిఎస్ఆర్‌టిసి బస్టాండ్‌కు పోతున్న సమయంలో నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. నా పాస్‌పోర్టు నెం: F883107, ఈ పాస్‌పోర్టు ఎవ్వరికైనా దొరికిన యెడల పై అడ్రస్‌కు గానీ, క్రిందిఫోన్ నెంబరుకు గాని తెలుపగలరు.

ఫోన్ నెం. 9666765299

విభిన్న ప్రతిభావంతులు పరికరాల కోసం పెద్ద ఎత్తున ధరఖాస్తులు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: పట్టణంలోని స్థానిక అనిబి సెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణంలో జిల్లా విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు ఏడీ కృష్ణ కిశోర్ ఆధ్వర్యం లో పెద్దసంఖ్యలో విభిన్న ప్రతిభావంతులు పరికరాల కోసం ధరఖా స్తులు తీసుకు న్నారు. ఈ క్యాంపుకు ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిధిలోని దాదా పు వెయ్యి మంది దివ్యాంగులు హాజరై తమకు కావాల్సిన పరిక రాల కోసం ధరఖాస్తు చేయడం జరిగింది. ఈ క్యాంప్ ఇంత దిగ్విజయంగా జరుపుటకు కృషి చేసిన దివ్యాంగ సంఘ నాయకులకు ఏడీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బయ్య యాదవ్, రాష్ట్ర కన్వీనర్ అఫ్జల్, షాకీర్ హుస్సేన్, రషీద్, రామసుబ్బయ్య, మహేష్‌కుమార్ పాల్గొన్నారు.

మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శశిభూషణ్‌రెడ్డికి సన్మానం

విశాలాంధ్ర-వేంపల్లి: అంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నియమించిన నామినేటెడ్ పోస్టుల్లో రాష్ట్ర మార్కెఫెడ్ డైరెక్టర్ గా నియామకమైన భాజపా జిల్లా అధ్యక్షులు వంగల శశిభూషణ్ రెడ్డిని గురువారం నాడు ఆ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం భాజపా జిల్లా కార్యదర్శి గాలి హరి ప్రసాద్ మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం గత 30 సంవత్సరాలుగా ప్రజా సమస్యలు, ప్రభుత్వ వైఫాల్యాలపై అలుపెరగని పోరాటాలతో పార్టీ అభివృద్దే ధ్యేయంగా, అంత్యోదయ స్ఫూర్తిగా పని చేస్తున్న వ్యక్తి శశిభూషణ్ రెడ్డి అని అన్నారు.విద్యార్థి దశలోనే భాజపా చేరి సర్పంచ్ గా పనిచేసి తన అసమాన్య ప్రతిభతో రెండుసార్లు జిల్లా అధ్యక్షునిగా, ఒక సారి రాష్ట్ర కార్యదర్శి గా,కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షునిగా పనిచేసారని చెప్పారు. ఈ కార్యక్రమం లో బీజేపీ నేషనల్ కౌన్సిల్ మెంబర్ కె రామచంద్రారెడ్డి, బీజేపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు దొంతు సుమన్ , వినోద్ కుమార్ రెడ్డి, సోము దశరధ పాల్గొన్నారు.

కల్తీ ఆహార వస్తువులపై సరికొత్త ప్రయోగం

విశాలాంధ్ర-పులివెందుల: కల్తీ ఆహార వస్తువులను కనుగొనే విషయమై ఆహార విజ్ఞానశాస్త్ర సాంకేతిక కళాశాల విద్యార్థులు సరికొత్త ప్రయోగం చేపట్టారు. ఆ మేరకు పట్టణ పరిధిలోని దత్తత తీసుకున్న బ్రాహ్మణపల్లి గ్రామంలో ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎమ్. మాధవ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు అధ్యాపకులు తెలిపారు. అతి సులువుగా పాలు, నెయ్యి, పసుపు, ఎండు మిర్చి కారం, ఉప్పు, మిర్యాలు, టీ పొడి మొదలగు ఇతర ఆహార పదార్థాల కల్తీని కనుగొనే వివిధ పద్ధతులు గ్రామంలో ప్రదర్శన చేసి చూపించారు. కార్యక్రమంలో దత్తత కార్యక్రమ చైర్మన్ డాక్టర్ ఎమ్. కీర్తి రెడ్డి, మెంబెర్ డాక్టర్ పి. జయమ్మ, బ్రాహ్మణపల్లి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు సి. హెచ్ పురుషోత్తమ రెడ్డి, ఇతర పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌కు రూ.10వేలు విరాళం



విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లె : రాష్ట్రంలో నిరుపేదల కోసం 175 నియోజకవర్గాల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశారు. దీనివల్ల ఎంతోమంది పేదలకు కడుపు నింపుతున్న అన్న క్యాంటీన్ కు తమ వంతు సహాయంగా ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కోమటిరెడ్డి శివ శంకర్ రెడ్డి గురువారం ప్రజా దర్బార్ కార్యక్రమంలో మంత్రి మం డి పల్లి రాంప్రసాద్రెడ్డి సోదరుడు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డికి 10,000 రూపాయల చెక్కును అందజేశారు. పేదల కడుపు నింపుతున్న ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపా ధ్యాయులు పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ మని విశ్వనాథ, పాల్గొన్నారు

ముగిసిన ఇది మంచి ప్రభుత్వం గ్రామ సభలు

విశాలాంధ్ర-బ్రహ్మంగారిమఠం : మండల పరిధిలోని 11 గ్రామ పంచాయతీలలో ప్రజా సమస్యల పైన ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమాలు పైన ఇది మంచి ప్రభుత్వం కార్యక్ర మం ద్వారా వంద రోజు పాలనలో ఆరు హామీలను అమలు చేసిన కూటమి ప్రభుత్వం అందులో భాగం గానే గ్రామ సభలను మండల అభివృద్ధి అధికారి ఆ పంచాయ తీల ఇన్‌ఛార్జిల అధికారులు ప్రజా ప్రతినిధులతో కలిసి గ్రామ సభలను నిర్ణయించారు. అందులో భాగంగానే మల్లెపల్లె , ముడమాల దిరశ వంచ పంచా యతీలలో సభలు ముగించారు. ఈ కార్యక్రమానికి మండల అభివృద్ధి అధికారి వెంగము ని రెడ్డి తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, వివిధ పంచాయతీల సర్పంచులు నాయకులతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం 100 రోజు పాలనలో పై తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విజయవాడలో వచ్చిన వరదల్లో తెలుగుదేశం పార్టీ అధినేత రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఐదు రోజులపాటు విజయవాడలో వరదల్లో ప్రజల సంక్షేమం కోసం ఆరోగ్యం ప్రజలు ఉండాలని ప్రజలంతా క్షేమంగా ఉండాలని లక్ష్యంతో అక్కడనే ఉండడం జరిగిందని నిరుపేదలకు అన్న క్యాంటీన్ ద్వారా 5/రూపాయలు భోజనం, మెగా డీఎస్సీ కు మొదటి సంతకం, ల్యాండ్ టైటిల్ రైతుల కు భూమి హక్కు కోసం అవ్వ తాతలకు పింఛన్లు 4000 నుండి పెంపు రైతుల కు ధాన్యం కొనుగోలు పైన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడం జరిగింది అని త్వరలో మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్ ఆర్టీసీ రవాణాను అమలు చేసే విషయంలో రెండు అడుగులు ముందుకేస్తుందని ఆయన పేర్కొన్నారు. అందులో భాగంగానే అన్ని గ్రామాలలో ఇది మన మంచి ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు ప్రజలకు సంక్షేమ పథకాలపై సమావేశాలను నిర్ణయించడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచు రాళ్లపాటి అమిర్ భాష, ముడమాల సర్పంచ్ భర్త, ముని రెడ్డి మల్లెపల్లె సర్పంచ్ భర్త, నారాయణ యాదవ్,తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఏవి సుబ్బారెడ్డి, భాస్కర్, శివ, తెలుగుదేశం పార్టీ నాయకులు సాంబశివరెడ్డి పూజా శివ యాదవ్ సుధాకర్ యాదవ్, మాజీ సర్పంచ్ బాలయ్య యాదవ్, ఆగిపోయిన రమణయ్య యాదవ్ బాల సిద్ధయ్య బాబు మాజీ ఎంపిటిసి సభ్యులు రమేష్, వివిధ శాఖ అధికారులు ప్రజాప్రతినిధులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మేలుకొలుపుతున్న ఎయిడ్స్ క్యాంపులు

విశాలాంధ్ర-రాయచోటి : రాయచోటి నియోజ వర్గం లో పిసిఎస్ ఎస్-టీఐ స్వచ్ఛం ద సంస్థ నిర్వహిస్తున్న ఎయిడ్స్ వ్యాధి క్యాంపులు ప్రజలకు మేలు కొలుపు అని అర్బన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. రాయచోటి పట్టణం అర్బన్ సర్కిల్ కార్యాలయంలో గురువారం పిసిఎస్ఎస్ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన మీకు తెలుసా కార్యక్రమానికి సర్కిల్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఎయిడ్స్ వ్యాధి చాప కింద నీరులా ఒకవైపు వ్యాప్తి చెందుతుం దన్నారు కొందరు అవగాహన లేక మరి కొందరు రక్త మార్పిడి వల్ల ఎయిడ్స్ బారిన పడుతున్నారని కావున సమాజంలోని యువతి, యువకులు ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని, అందరూ సహకరిస్తే ఎయిడ్స్ రాహిత రాష్ట్రంగా మారు తుం దన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వా లు ఎయి డ్స్ వ్యాధి నివారణ కోసం ఎంతో కృషి చేస్తుం దన్నారు. సమా జంలోని ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు చిన్నచూపు చూడం తగదన్నారు. ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, వచ్చిన వారు ఎలా నివారణ చర్యలు తీసుకో వాలి తదితర అంశాలను ఆయన వివరించారు. సమావే శంలో పిసిఎస్ఎస్ ప్రాజెక్ట్ మేనేజర్ స్వాతి మాట్లాడు తూ ఎయిడ్స్ వ్యాధి వచ్చిన వారికి టిబి వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువ అని, అందుకు కారణం వారిలో రోగనిరోధక శక్తి తక్కువగా ఉండడం వలన తక్కువ పోషక విలువలు ఉన్నటువంటి ఆహారం తీసుకోవడం వలన టిబి వచ్చే అవకాశం ఎక్కువ అన్నారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా ఏఆర్టి మందులు తీసుకోవడం వలన వారి యొక్క జీవిత కాలాన్ని పెంచవచ్చని ఆమె తెలిపారు.

బచ్చలపుల్లయ్యకు తగిన గౌరవం ఇవ్వలేదు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: రాష్ట్ర స్థాయిలో చైర్మెన్ కేటాయిం చవలసిన వ్యక్తికి డైరెక్టర్‌గా కేటాయించడం బాధాకరం అని బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి వెంకట కృష్ణ యాదవ్, జిల్లా కన్వీనర్ మాదాసు మురళీలు పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాటా ్లడుతూ కడప జిల్లాలోనే బీసీలలో మంచి గుర్తింపు, అహర్నిషలు కృషి చేసినటువంటి బచ్చుల పుల్లయ్యకి కేవలం డైరెక్టర్‌గా కేటాయించడం దారుణం అన్నారు. గత ప్రభుత్వం కడప జిల్లాలో బీసీలపై ఎన్ని కేసులు పెట్టిన లెక్క చేయకుండా కూటమికి గెలుపు కొరకు పోరాడి అత్యధిక స్థానాలను సాధించడంలో కీలకపాత్ర పోషించిన బీసీలపై చిన్న చూపు చూడటం ఏమిటని ప్రశ్నించారు. ఎన్నికల మొత్తం బీసీలే మా వెన్నెముక అని చెప్పినటువంటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పదవిలోకి వచ్చాక బీసీలకు తగిన గుర్తింపు గల పదవులను వారికే కేటాయించే విధంగా కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం తరపున కోరుతున్నామన్నారు. ఇప్పటికైన ముఖ్యమంత్రి చంద్రబాబు పున: పరిశీలించుకొని బచ్చల పుల్లయ్యకు చైర్మెన్ పదవి కేటాయించాలని బీసీలకు అత్యున్నత ప్రాధాన్యత గల పదవులను కేటాయించాలని ఈ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి ప్రధాన పదవులపై బీసీలకే కేటాయించాలని ముఖ్యమంత్రికు లేఖ రావాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల శ్రీనివాసచార్య, జిల్లా కార్యదర్శి కాలే దేవానంద్, సుబ్బరాజు, వడ్డే బాల సెద్దయ్య, గాండ్ల సాధికారిక కమిటి రాష్ట్ర సభ్యులు జి.చిన్న పుల్లయ్య, శ్రీనివాసులు, రఘు తదితరులు పాల్గొన్నారు.

అన్నక్యాంటీన్ తనిఖీ

విశాలాంధ్ర-పులివెందుల: పట్టణ పరిధిలోని అన్యాక్యాంటీన్‌ను గురువారం మున్సిపల్ కమిషనర్ రాముడు తనీఖీ చేశారు. ఎంత మందికి సరఫరా చేస్తున్నారు ఎంతమందికి వడ్డిస్తున్నారు అని అన్నా క్యాంటీన్ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.వ ంటల రుచి గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం ప్రజలకు ఆహారాన్ని సరఫరా చేయాలన్నారు నిర్వాహకులకు సూచించారు.

ఫుడ్‌టెక్నాలజీ కళాశాలలో విద్యార్థుల శ్రమదానం

విశాలాంధ్ర-పులివెందుల: పట్టణ శివార్లలోని "ఆహార విజ్ఞాన శాస్త్ర మరియు సాంకేతిక కళాశాల" లో "స్వచ్ఛతా హీ సేవా" లో భాగంగా 'పరిశుభ్రత' కార్యక్రమం గురువారం కళాశాలలో నిర్వహించారు. కళాశాల జాతీయ సేవా పథకం రెండు యూనిట్ల విద్యార్థి వాలంటీర్లు కళాశాల పరిసర ప్రాంతాలలో ప్లాస్టిక్ వ్యర్థాలు, కలుపు మొక్కలు మరియు ఇతర వ్యర్థాలను తొలగించి శుభ్రం చేసారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎమ్. మాధవ, జాతీయ సేవా పథకము అధికారి డాక్టర్ జయమ్మ విద్యార్థి వాలంటీర్లతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కీర్తి రెడ్డి, డాక్టర్ సాయి శ్రీనివాస్, డాక్టర్ జాకిర్ బాషా మరియు పి.డి డాక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

పరిశుభ్రతపై చిత్ర లేఖనం పోటీలు

విశాలాంధ్ర-వేంపల్లి: పరిసరాలు పరిశుభ్రతపై బాలుర పాఠశాలలో చిత్ర లేఖనం పోటిలను నిర్వహించారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ మాస్టర్ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛత - పరిశుభ్రతపై చిత్ర లేఖనం పోటిల్లో విద్యార్థులు ప్రాల్గొని తమ ప్రతిభను చాటారు. చిత్ర లేఖనం పోటిల్లో ప్రతిభ చాటినా విద్యార్థులను హెచ్ ఎం శివ మునెమ్మ అభినందించారు. పోటి పరీక్షల వలన విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యం బయట పడుతుందని చెప్పారు. ఇలాంటి పోటి పరీక్షల్లో విద్యార్థులు విరివిగా హజరు కావాలని కోరారు. విద్యార్థులను ఆసక్తి పెంచే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డ్రాయింగ్ మాస్టర్ సురేష్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్‌మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపిన ఎమ్మెల్సీ రమేష్ యాదవ్

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: వైఎస్ఆర్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షు నిగా నియమిం చినందు కు వైకాపా అధ్యక్షులు జగన్‌మోహన్ రెడ్డిను ఎమ్మెల్సీ ఆర్.రమేష్ యాదవ్ కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. గురువారం నాడు తాడేపల్లిలోని మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నివాసం నందు మర్యాదపూర్వకంగా కలిసి తనను వైఎస్ ఆర్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమిం చినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బీసీల సమస్యలపై పోరాడదా నికి వారి సమస్యలు పరిష్కరించడానికి వివిధ బీసీ కమిటీల ద్వారా నిర్వహించాల్సిన విధులను రమేష్ యాదవ్‌కు సూచించా రు. అదేవిధంగా తనపై నమ్మకం తో తనకు ఈ బాధ్యతను అప్పగించినందుకు రాష్ట్రమంతా పర్యటించి బీసీలలోని అన్ని కులాల వారిని కలిసి వారి సమస్యలను జగనన్న దృష్టికి తీసుకొని వెళ్లి వాటి పరిష్కా రానికి కృషి చేస్తానని, బీసీలు ఎప్పటికి జగన్‌మోహన్ రెడ్డి వెంటే నడుస్తూ తిరిగి జగనన్నను ముఖ్యమంత్రిగా చేయడానికి బీసీల తరపున కృషి చేస్తామని జగన్‌మోహన్ రెడ్డికి ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ మాట ఇచ్చారు.

ఇది మంచి ప్రభుత్వం

విశాలాంధ్ర-యర్రగుంట్ల : రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభు త్వం అధికా రంలోకి వచ్చి వంద రోజుల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఇది మంచి ప్రభుత్వం పేరిట కార్యక్రమానికి శ్రీకారం చుట్టా రు. ఇందులో భాగంగా స్థానిక పురపాలిక రెండవ సచివా లయం పరిధి లోని 3వ వార్డులో గురువారం జరిగిన కార్యక్రమంలో కూటమి నాయకులు తుంగా మోహన్, కొండారెడ్డి పాల్గొని కూటమి ప్రభుత్వం యొక్క పనితీరు ను, వందరోజుల్లో సాధించిన ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక పింఛన్ల లబ్ధిదారులకు సకాలంలో పింఛన్ మొత్తాలు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. విభిన్న ప్రతిభావం తులకు రూ.3వేల నుంచి రూ.6వేలకు పెంచడంతో వారి కళ్లలో ఆనం దానికి అవధులు లేకుండా పోయాయని గుర్తుచేశారు. గత ప్రభుత్వ హయాంలో మూతపడ్డ అన్నా క్యాంటీన్లను పున:ప్రారంభించి పేదలకు ఆకలి తీర్చడం జరుగుతోం దన్నారు. ఉచిత ఇసుక విధా నం అమలుతో గృహ నిర్మాణదారులకు ఇసుక కష్టాల నుంచి ఉపశమనం కలిగించామన్నారు. ఒడిదుడు కులను అధిగమిస్తూ సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయడం జరుగుతుందని భరోసానిచ్చారు. ఈ కార్యక్ర మంలో సచివాలయానికి సంబంధించి రూప, సుమంత్, రఫీ, శివ పాల్గొన్నారు.

అనాధ పిల్లలకు ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - రైల్వేకోడూరు: నియోజకవర్గం పుల్లంపేట మండలంలోని టి కమ్మపల్లి పంచా యితీ అరుంధతివాడ కు చెందిన ఇందుకూరు మణెమ్మ ప్రసవ సమయంలో మరణించింది.ఆమె మర ణంతో అనాథలైన పిల్లలు భవిష్య, వరలక్ష్మి లకు ఆపద్బాంధవుడు తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ముక్కా రూపా నందరెడ్డి ఫౌండేషన్ ద్వారా ఒక్కొక్కరికి 25 వేల రూపా యలు చొప్పున 50,000 రూపాయలు చెక్ రూపంలో అందజేసి మానవ త్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమం లో తెలుగు మహిళా నాయకురాలు ముక్కా వరలక్ష్మి,బత్తిన వేణుగోపా ల్ రెడ్డి, సింగమాల మల్లి ఖార్జున రెడ్డి, రామచంద్రనాయుడు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి : ప్రజల సమస్యలను పరిష్కరించడం కోసమే ప్రజా దర్బార్ ను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర రవాణా క్రీడా యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సోదరులు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని అనంతపురం గ్రామ పంచాయతీ ఈడిగపల్లిలో ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ముందుగా డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి శ్రీ శ్రీ శ్రీ అనంతర గంగమ్మతల్లిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ పూజారులు చెల్లు గంగరాజు యాదవ్ , రవి యాదవ్ , ఆదిమూలం రెడ్డిశేఖర్ , ఆదిమూలం రామ చంద్ర లు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఈడిగపల్లిలో ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లి మండలంలో ఎక్కువగా త్రాగునీటి సమస్య ఉందని ఆ సమస్యను మంత్రి చొరవతో పరిష్కరిస్తామన్నారు. మండలంలో రెవెన్యూ సమస్యలపై ఫిర్యాదులు అందాయని వాటిని రెవెన్యూ అధికా రుల దృష్టికి తీసుకెళ్లి మంత్రి చొరవతో పరిష్కరిస్తామన్నారు. డి.ఆర్.డి.ఏ. పిడి సత్యనారాయణ మాట్లాడుతూ 6000 పింఛన్లకు 2.5 కోట్ల రూపాయలు నగదును అందజేశా మన్నారు. గృహ నిర్మాణ శాఖ పిడి సాంబశివ మాట్లాడుతూ 8.50 కోట్ల రూపాయలతో 2912 ఇల్లులు మంజూరు కాగా 1426 పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశలలో ఉన్నాయన్నారు. వాటిని త్వరలోనే పూర్తి చేయిస్తామన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కొండయ్య మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి వైద్య సేవ అందిస్తున్నామని తెలిపారు. జిల్లా పశు వైద్య శాఖ అధికారి గుణశేఖర్ పిళ్ళై మాట్లాడుతూ పాడి పశువుల పెంపకం గ్రామీణ ప్రాంతాల మహిళ లు యువతీకి ఉపాధి కల్పన ఉంటుందన్నారు. జిల్లా పంచాయతీ రాజ్ అధికారి దయాకర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో 42 పనులు 1.40 కోట్లతో సిమెంట్ రోడ్లతో పాటు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామ న్నారు. డి ఆర్ డబ్ల్యు ఎస్ శ్రీనివాసులు మాట్లాడుతూ వర్షాలు సక్ర మంగా కురువక మండలా ల్లో నీరు అడుగంటి పోయాయని మంత్రి చొరవతో త్రాగు నీటి సమస్య లేకుండా చేస్తామన్నారు. వ్యవసాయ సంచాలకులు జయరాణి మాట్లాడుతూ మండలంలో 11 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయని సబ్సిడీతో ఉలవలను పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. టిడిపి మండల యువ నాయకులు మాజీ ఎంపీటీసీ మదన్‌మోహన్ మాట్లాడు తూ మండలంలో త్రాగునీటి సమస్య ఎక్కువగా ఉందని , త్రాగునీటిలో ఫ్లోరైడ్ అధికంగా ఉందని త్వరలోనే మంత్రి దృష్టికి తీసుకెళ్లి ఫ్లోరైడ్ సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీ ప్రసన్న , ఎంపీడీవో వెంకట్రామిరెడ్డి , సీడీపీవో పద్మావతి , బీజేపీ మండల అధ్యక్షుడు కొండూరు వెంకట్రామ రాజు , మాజీ ఏ.పీ.ఐ.ఐ. సి.చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి , కాంట్రాక్టర్ పాపయ్య , రాజంపేట డాక్టర్ సెల్ ప్రధాన కార్యదర్శి షఫీ నాయక్ , గురుస్వామి వెంకటేశ్వర్లు , టి.ఎన్.టి.యు. జిల్లా కార్యదర్శి ఆదిమూలం రామచంద్ర, కన్వీనర్ వీరాంజనేయులు , శివ మల్లారెడ్డి , దేవా నంద రెడ్డి , యాగంటి సుధీర్ , బాబుల్ రెడ్డి ,కావలి ఆంజనేయులు , మూగి వెంకటరమణ , జనార్దన్ రెడ్డి , దండే శ్రీనివాసులు , నస్రుద్దీన్ , విశ్వనాథ, వెంకటకృష్ణ , మాజీ సర్పంచ్ లు , మాజీ ఎంపిటిసిలు , పలుశాఖల అధికారులు , టీడీపీ నాయకులు , కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

నేడు మోటకట్ల సచివాలయంలో ఉలవలు పంపిణీ

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: మోట కట్ల సచివాలయం నందు నేడు శుక్రవారం 80 శాతం సబ్సిడీతో రైతులకు ఉలవలు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి కిషోర్ నాయక్ సహాయ అధికారి సందీప్ గురువారం తెలిపారు. ఉలవ పంట సాగు చేసే రైతులు మాత్రమే విత్తనాన్ని తీసుకువెళ్లాలన్నారు. పంట సాగు చేసిన తర్వాత సాగు చేసిన ప్రతి రైతు పంట నమోదు చేసుకోవాలని తెలియజేశారు .రైతులు సబ్సిడీ విత్తనాలను దుర్వినియోగం చేయరాదని తెలిపారు . రైతు 174 రూపాయలు చెల్లించి 10 కిలోల బస్తా తీసుకు వెళ్లవచ్చు అన్నారు. ఒక్కో రైతుకు 10 కేజీలు మాత్రమే ఇస్తామన్నారు. రైతు ఆధార్ కార్డు, భూమి పాస్ బుక్, సెల్ ఫోన్, రైతు బయోమెట్రిక్ ద్వారా ఉలవలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

సోమిరెడ్డిపల్లె ప్రధాన రహదారికి బ్రిడ్జికి మోక్షం ఎప్పుడు ?

విశాలాంధ్ర - బ్రహ్మంగారి మఠం : మండల పరిధిలోని సోమిరెడ్డి పల్లె ప్రజలు బద్వేల్ పొలాల్లోకి వెళ్లాలన్న భారీ వర్షం వచ్చిన సోమిరెడ్డి పల్లె వంక వర్షపు నీరు చేరి బ్రిడ్జి లేకపోవడంతో ప్రజలకు రాకపోకలు రవాణా సౌకర్యాలు బంద్ అయ్యే అవకాశాలు ఉండడంతో ప్రజలకుఅవస్థలు తప్పడం లేదు. ఈ ప్రాంత నియోజకవర్గ రాజకీయ నేతలు హామీల తప్ప అమలు చేసేది విషయంలో నిర్లక్ష్యమే తప్ప మరొకటి లేదని ఈ సోమిరెడ్డి పల్లె వంక పెద్ద వర్షం వచ్చిన వంక సాగితే బద్వేల్ పట్టణానికి ప్రాంతాలకు అవకాశం లేకపోవడం బద్వేల్ నుండి బ్రహ్మంగారి మఠానికి వచ్చేందుకు కూడా అవకాశం లేకపోవడం నంది పల్లె నుండి పల్లెల వారు బ్రహ్మంగారి మఠానికి రావాలన్న అవస్థలు పడుతున్నారని ఈ సోమిరెడ్డి పల్లె వంకకు బ్రిడ్జికి మోక్షం ఎన్నడూనని గ్రామస్తులు వివిధ గ్రామ ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 1980 ఇంతవరకు ఈ బ్రిడ్జికి మోక్షం కలగడం లేదని ఎన్నికల ముందు పార్టీ నాయకులు ఓట్ల కోసం హామీలిస్తారే తప్ప వాటిని అమలు చేసే విషయంలో నిర్లక్ష్యమేనన్నారు. ఇప్పటికైనా ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు జిల్లా కలెక్టర్ ఆర్అండ్‌బి అధికారులు కానీ దృష్టి పెట్టి సోమిరెడ్డి పల్లె వంక బ్రిడ్జి ఏర్పాటుకు దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా బ్రహ్మంగారిమఠం మండల పరిధిలోని తోట్లపల్లి పంచాయితీ, పాపిరెడ్డి పల్లె, సమీపంలో పలుగురాళ్లపల్లె ప్రధాన రహదారి ఉన్న వంక కూడా బ్రిడ్జి ఏర్పాటు చేయడం రాకపోకలు జరుగుతాయన్నారు. గతంలో బ్రిడ్జి టెండర్లు పనులను పిలిచి మరి ఎందుకు ఆగడం జరిగిందని, చౌదరివారి పల్లె, వద్ద ఉన్న వంక పరిస్థితి ఇదే పరిస్థితి అన్నారు. చౌదరివారి పల్లె నుండి పలుగురాళ్లపల్లె పోరుమామిళ్లకు వెళ్లే అవకాశం కూడా ఉందన్నారు. ఈ వంక కూడా బ్రిడ్జిని ఏర్పాటు చేస్తే అక్కడ పల్లెలకు కూడా రాకపోకలు జరుగుతాయి అన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టి రాకపోకలపై ప్రయాణికులకు సౌకర్యాలను కల్పించాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

మాజీ సిఎంను కలిసిన బిజెపి నాయకులు

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ని గురువారం మాజీ సిఎం స్వగ్రామం కలికిరిలో రైల్వేకోడూరు బిజెపి నాయకులు దాసరాజు జయప్రకాష్ నారాయణ వర్మ,గడ్డం చంగల్ రాజు,తోట శ్రీనివాసు లు, జి వెంకటేష్,కంబాల శీను తదితరులు కలిసి నియోజకవర్గ అభివృద్ధి పై సుదీర్ఘం గా చర్చించారు.రైల్వేకోడూరు నియోజకవర్గ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

సుదర్శన్ రాయల్ ను పరామర్శించిన వైకాపా నాయకులు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప నగరంలోని దేవుని కడపలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సుదర్శన్ రాయల్‌ను గురువారం మాజీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ భాషా , కడప నగర మేయర్ కే.సురేష్ బాబు పరా మర్శించారు. సుదర్శన్ రాయల్ ఇంటిపై జనసేన కార్యకర్తలు దాడి చేశారు. ఈ విషయం తెలుసుకున్న సుదర్శన్ రాయల్ ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు ధైర్యం చెప్పారు. దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున సుదర్శన్ రాయల్‌కు పూర్తిగా అండగా ఉంటామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్,కార్పొరేటర్ పాకా సురేష్, నాయకులు దాసరి శివ, రమేష్ రెడ్డి , మునిశేఖర్ రెడ్డి, రామకృష్ణ, శివ,ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవడం హర్షనీయం

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: విపత్కర పరిస్థితిలో బాధితులను ఆదుకోవడం ఎంతో గొప్ప విషయమని రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సోదరుడు టిడిపి యువనాయకులు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం రాయచోటి పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయం నందు రాయచోటి ఎక్స్ ఆర్మీ అసోసియేషన్ వారు వరద బాధితుల సహాయార్థం 23 వేల రూపాయల చెక్కును టిడిపి యువ నాయకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డికి అంద జేశారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో తమ సామాజిక బాధ్యతగా మన ప్రాంత వాసులు 23 వేల రూపాయల చెక్కు అంద జేయడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మిలిటరీ ప్రెసిడెంట్ గురిగింజ బాలాజీ మరియు అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థలో "స్వచ్ఛత హి సేవా"

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థ కమీషనర్ వై.ఓ. నందన్ ఆదేశాల మేరకు, కడప నగరపాలక సంస్థలోని అధికారులు, ఉద్యోగులు "స్వచ్ఛత హి సేవా" కార్యక్రమంలో భాగంగా వారి సెక్షన్ పరిసరాలను శుభ్రపరచే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రతి సెక్షన్‌లో ఉన్న వారు, వారి కార్యాలయ పరిసరాలను శుభ్రపరచాలని కమీషనర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ వై ఓ నందన్ మాట్లాడుతూ, "మన నగరం పరిశుభ్రంగా ఉండడం ప్రతి ఒక్కరి బాధ్యత. పరిశుభ్రత మన ఆరోగ్యానికి, మన సమాజ అభివృద్ధికి కీలకమైనది. ప్రతి ఒక్కరు శ్రమించి, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో భాగస్వాములు కావాలి. మన కృషి, మన కడపను ఒక శుభ్రమైన, హరిత నగరంగా తీర్చిదిద్దుతుంది. మీ ప్రతి చర్య, ప్రతి అవగాహన నగరానికి ప్రేరణ!" అని పేర్కొన్నారు. ఇంజినీరింగ్ విభాగం, రెవెన్యూ విభాగం, ఎస్టాబ్లిష్మెంట్ విభాగం, హెల్త్ విభాగం మరియు టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, నగరపాలక సిబ్బంది అందరూ తమ తమ సీట్లు, పరిసరాలను శుభ్రపరచి, వ్యర్థాలను తీసివేయడం ద్వారా ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. "సమూహంగా పనిచేస్తే, స్వచ్ఛత సాధ్యమే. ప్రతి వ్యక్తి కడపను పరిశుభ్రంగా ఉంచడం మనందరి లక్ష్యం కావాలన్నారు.

శుభ్రత పాటించడమే నిజమైన సేవ...

విశాలాంధ్ర - కడప : కడప జిల్లా ఆరోగ్య శాఖ కార్యాలయంలో 17-09-2024 నుండి 01-10-2024 తేదీ వరకు జరిగే "స్వచ్ఛతా హీ సేవ 2024" సందర్భంగా గురువారం పరిశుభ్రత మరియు పారిశుద్ధ్యం లో భాగముగా, శుభ్రత పాటించడమే నిజమైన సేవ అని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కే. నాగరాజు గారు తెలియజేశారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ కార్యా లయము ఆవరణములో గురువారం ఉదయము డాక్టర్ కే.నాగరాజు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి మరియు అన్ని శాఖల సిబ్బంది పాల్గొని పరిసరములు శుభ్రము చేయడం జరిగినది మరియు ప్రతి సెక్షన్ వారు వారి వారి గదులను శుభ్రం చేసుకోవడం జరిగినది. ఈ కార్యక్రమములో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కే .నాగరాజు, డాక్టర్ ఉమామహేశ్వర కుమార్ డి ఐ ఓ, డాక్టర్ శశిభూషణ్ రెడ్డి డి.పి.ఎమ్.ఓ., ఎన్.హెచ్.ఎం, డాక్టర్ వెంకట చంద్రారెడ్డి జిల్లా సర్వలెన్స్ ఆఫీసర్ మరియు కార్యాలయము సిబ్బంది అందరూ పాల్గొన్నారు.

రేబిస్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలి : కమిషనర్

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప నగర పాలక సంస్థ కమిషనర్ చాంబర్ నందు గురువారం రేబిస్ వ్యాధి నియంత్రణపై సమీక్ష సమావేశం జరిగింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సంయుక్త సంచాలకులు శారదమ్మ, ఉప సంచాలకులు డా. రంగాస్వామి, డా.స్వర్ణ, డా.అనుపమ్మ తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో రేబిస్ వ్యాధి నివారణపై కడప నగరంలో అవగాహన కార్యక్రమాలు మరింతగా చేపట్టడంపై చర్చించామని తెలిపారు. అందులో భాగంగా కడప జిల్లాలో ప్రపంచ రాబిస్ డే 28.9.2024న పలు వ్యాక్సినేషన్ కార్యక్రమములను చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ వ్యాధి నిరోధక చర్యలను మరింత బలపర్చేలా కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సమావేశంలో 2030 నాటికి ప్రపంచం నుండి రేబిస్ నిర్మూలన లక్ష్యంగా, కుక్కల నుండి వ్యాధి వ్యాప్తిని అరికట్టడం మరియు టీకా కార్యక్రమాలను సమర్థంగా అమలు చేయడంపై అధికారులు పలు సలహాలు, సిఫారసులు ఇచ్చారు.

ఎస్టీయు సామాజిక కార్యక్రమాలు అభినందనీయం

విశాలాంధ్ర - జమ్మలమడుగు : విద్యా బోధన మాత్రమేకాక,ఉపాధ్యాయులకు సేవలు అందిస్తూ సామాజిక కార్యక్రమాల్లో కూడా ముందుండడం రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం గొప్పతనం అని ప్రొద్దుటూరు ఉప విద్యాశాఖ అధికారి కృష్ణప్ప కొనియాడారు. గురువారం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల గూడెంచెరువు నందు రాష్ట్రోపాధ్యాయ సంఘం ఏర్పాటు చేసిన ఉచిత దంత మరియు జనరల్ వైద్య శిబిరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప విద్యాశాఖ అధికారి కృష్ణప్ప మాట్లాడుతూ ఎస్ టి యు అనేక ఉపాధ్యాయ సేవా కార్యక్రమాలు చేస్తుందని అన్నారు.అలాగే పాఠశాలల విద్యార్థుల పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ కనబరిచి డాక్టర్లను పాఠశాలకే పిలిపించి వైద్య సేవలు అందించడం హర్షనీయమని తెలిపారు. అలాగే పాఠశాల సిబ్బందితో మాట్లాడుతూ విద్యా విధా నంలో నూతన సాంకేతిక విధానాలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ విద్యార్థులకు మంచి విద్యతోపాటు క్రమశిక్షణ అలవర్చాలని తెలిపారు, సకాలంలో సిలబస్ పూర్తి చేసి, పరీక్షల మార్కులు నమోదు చేయాలని తెలిపారు.రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కౌన్సిలర్ మరియు పాఠశాల ఉపాధ్యా యుడు గురు కుమార్ మాట్లాడుతూ పాఠశాలలో అనేకమంది విద్యార్థులు జ్వరము, జలుబు, దగ్గు మొదలగు వ్యాధులతోనూ, దంత సంబంధిత వ్యాధుల తోనూ, బాధపడుతున్నట్లు గుర్తించి దంత వైద్యులు డాక్టర్ భారతి,డాక్టర్ తేజ, డాక్టర్ దీపిక లను పాఠశాలకే పిలిపించి వైద్య సేవలు అందించామని తెలిపారు.విజయవాడ వరద బాధితులకు కూడా ఎస్.టీ.యు సహాయం చేసిందని తెలిపారు.ఈ సమావేశంలో జమ్మలమడుగు మండల విద్యాధికారి డి.చంద్రశేఖర రావు, పెద్దముడియం మండల విద్యాధికారి చౌడయ్య ,ఎస్టియు రాష్ట్ర కమిటీ కన్వీనర్ కుండా భాస్కర్, జమ్మలమడుగు మండల అధ్యక్షులు మల్లికార్జున, ప్రధాన కార్యదర్శి గురు ప్రసాద్, ఆర్థిక కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవిత, ఇతర ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఊసరవెల్లిలా కార్బన్ పౌడర్ !

స్థావరాన్ని మార్చుకున్న కేంద్రం - ఓ సిమెంటు పరిశ్రమ ఉద్యోగి దందా

విశాలాంధ్ర-యర్రగుంట్ల : ఈ ప్రాంతంలోని సిమెంటు పరిశ్రమలకు సరఫరా అవుతున్న కార్బన్ పౌడర్ నిల్వ కేంద్రం ఆయా ప్రాంతాల ప్రజల ఫిర్యాదులతో తరచూ స్థావరాన్ని మార్చుకుంటూ ఊసరవెల్లిని మరిపిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా కార్బన్ పౌడర్ నిల్వ ఉంచి సిమెంటు పరిశ్రమలకు సరఫరా చేస్తున్న విషయం తెలిసిందే. ఇక్కడి సమీపంలోని ఓ సిమెంటు పరిశ్రమలో ఉన్నత ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతూ ఈదందాను కొనసాగిస్తుండడం గమనార్హం.ఇప్పటి వరకు కమలాపురం మండలం నల్లలింగాయపల్లె సచివాలయ పరిధిలోని కార్బన్‌పౌడర్ నిల్వ కేంద్రం తాజాగా వీరపునాయునిపల్లె మండలం అలిదెన గ్రామ సచివాలయం పరిధిలోని ఓ గ్రామ సమీపంలోని ప్రభుత్వ బంజరు గుట్ట ప్రాంతంలో వెలసినట్లు సమాచారం. ఆ ప్రాంతంలోని ఓ రాజకీయ పార్టీకి చెందిన చోటా శ్రేణులకు కొంతమొత్తం సదరు కేంద్రం నిర్వాహకులు ముట్టజెప్పి కార్బన్ పౌడర్ నిల్వ కేంద్రాన్ని నిర్విగ్నంగా కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. కొందరు సామాజిక కార్యకర్తలు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకుపోయి నట్లు సమాచారం. కార్బన్ పౌడర్ కేంద్రాల నిర్వహణపై రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ప్రజల ఆరోగ్యాలను పరిరక్షించాలని సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు.

భూములను కోల్పోతున్న రైతులకు న్యాయం చేస్తాం

విశాలాంధ్ర - బ్రహ్మంగారి మఠం : జాతీయ ప్రధాన రహదారి హైవే సిక్స్ లైన్ రోడ్డుకు భూములను కోల్పోయే రైతులకు బి మఠం మండల మైదుకూరు మండలం, ఆదిమూర్తి పల్లె బి కోడూరు మండలం మున్నెల్లి పరిధిలోని మల్లేపల్లి లింగాలదిన్నె పల్లె, ముదుమాల గ్రామపంచాయతీలలో సిక్స్ లైన్ హైవే రోడ్డు లకుభూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేస్తామని ఇన్ఛార్జి ఆర్డీఓ చంద్రమోహన్ రైతులతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆది మూర్తి పల్లె, మల్లెపల్లె పంచాయతీ, ముదుమాల పంచాయతీలో బి కోడూరు మండలం మున్నెల్లి భూములు కోల్పోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగే విధంగా చూస్తామని రికార్డును పరిశీలన చేసి తగు న్యాయం చేస్తామన్నారు. ప్రస్తుతం రికార్డులో ఉన్న వారికే అమౌంట్ పే చేస్తామని వారం వారం పరిశీలన ఉంటుందని ఏ ఒక్క రైతు బాధపడకుడదని అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామన్నారు. వన్ వీ అడంగల్ ఆర్ హెచ్ ఆర్ ప్రకారంగా వారికి న్యాయం జరుగుతుందని పి ఓ టి భూములు, డికెటు భూములపై క్షుణ్ణంగా పరిశీలిస్తామని భూమి హక్కుల ఉన్న వారికి న్యాయం చేస్తామన్నారు. కొంతమంది రైతులు రోడ్డు పనులను అడ్డుకుంటున్నారని అలాంటి పనులు చేయొద్దని వారికి న్యాయం జరిగే విధంగా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ దామోదర్ రెడ్డి, విఆర్ఓ, జాన్సి, సర్వేరు, లక్ష్మీనారాయణమ్మ, తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, స్థానిక సర్పంచ్ భర్త, ముని రెడ్డి రమణ యాదవ్, రమేష్, బాల సిద్దయ్య బాబు, తెలుగు దేశం పార్టీ నాయకుడు పూజ, శివ యాదవ్, సుధాకర్, నాగయ్య, బాలయ్య, యాదవ్ మాజీ సర్పంచ్) రైతులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఓగా ముకుందరెడ్డి బాధ్యతలు

విశాలాంధ్ర - ముద్దనూరు : మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎంపిడిఓగా అలవల పాటి ముకుందరెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన వేంపల్లి మండలంలోని గండి వీరంజనేయ స్వామి ఆలయం లో ఈ.ఓ గా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చారు.ఈ మేరకు ఆయన బాధ్యతలు చేపట్టడంతో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది అంద రూ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధి కోసం తమవంతు సహాయ సహకారం అందిస్తామని, తమ దృష్టికి ఏ సమస్య వచ్చినా పరిష్కరిస్తామని వారు తెలిపారు.

..స్వచ్ఛతహి సేవా కార్యక్రమం

(మొదటి పేజీ తరువాయి) పరిసరాలన్నీ పరిశుభ్రంగా దర్శనమి స్తున్నాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. దేశ ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుల పిలుపు మేరకు.. రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల్లో ఈ "స్వచ్ఛతాహి సేవా" కార్యక్రమాన్ని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పబ్లిక్, ప్రయివేటు సంస్థాగత రంగాలకు చెందిన ప్రతి ఒక్కరూ.. స్వచ్ఛందంగా వారి పరిసరాలను శుభ్రపరచడం జరుగుతోందన్నారు.ఈ కార్యక్రమంలో డిపిఓ ప్రభాకర్ రెడ్డి, కలెక్టరేట్ ఏఓ విజయ్ కుమార్, హౌసింగ్ పీడి కృష్ణయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వరరావు, ఐఅండ్‌పీఆర్ ఎడి పి.వేణుగోపాల్ రెడ్డి, కలెక్టరేట్ లోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

..రైతు వ్యధ వినేందుకు పద!

(మొదటి పేజీ తరువాయి) సంబంధించిన ఓ అధికారిని సంప్రదించగా మండలాల వారీగా బడ్జెట్ కేటాయింపు ఉంటుందన్నారు. అవసరం మేరకు చేసిన వ్యయానికి ఆయా మండలాల అధికారులు బిల్లులు పెట్టుకోవాలని చెప్పారు.

స్వంత నిధులతో రోడ్డు బాగు చేయించిన కాలువపల్లె సర్పంచ్

విశాలాంధ్ర - బద్వేలు : బద్వేల్ నుండి కాలవపల్లె గానుగపెంట పోవు రోడ్డు వర్షం కారణంగా కొండపై నుండి వర్షపు నీరు వచ్చి కంప చెట్లు రోడ్డు ఆక్రమించడంతో రాకపోకలకు చాలా అంతరాయం ఏర్పడింది. ఆ చుట్టు గ్రామాల ప్రజలు సర్పంచ్ పసుపులేటి శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లగావెంటనే స్పందించి జెసిబి సహాయంతో రాకపోకలు పునరుద్ధించడం రోడ్డుకి ఇరువైపులా పెరిగిన కంప చెట్లను తొలగించడం జరిగింది.

స్వచ్ఛభారత్ మనిషి జీవితంలో నిరంతర ప్రక్రియగా కొనసాగాలి

పోతు గుంట రమేష్ నాయుడు, జంబు సూరి నారాయణ

విశాలాంధ్ర -రాజంపేట: స్వచ్ఛభారత్ మనిషి జీవితంలో నిరంతర ప్రక్రియగా మారాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నంద్యాల జిల్లా ఇంచార్జ్ పోతు గుంట రమేష్ నాయుడు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు, నాగిరెడ్డిపల్లి సర్పంచ్ జంబు సూర్యనారాయణ అన్నారు. స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం నందలూరు మండలం నాగిరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని నాగిరెడ్డిపల్లి పాఠశాలలో మొక్కలు నాటి అనంతరం స్వచ్ఛభారత పైన అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నంద్యాల జిల్లా ఇంచార్జ్ పోతుగుంట రమేష్ నాయుడు,జంబ్బు సూర్యనారాయణ మాట్లాడుతూ మనిషి జీవితంలో స్వచ్ఛభారత్ ఒక భాగంగా ఉండాలని, నిత్యం మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే మనం ఆరోగ్యవంతులం అవుతామనితెలిపారు. అలాగే ప్రతి ఒక్కరు కూడా తల్లి పేరుతో ఒక చెట్టును నాటి సంరక్షించాలని తద్వారా వాతావరణ సమతుల్యం ఏర్పడకుండా ఉంటుందని అన్నారు. అనంతరం ఎంఈఓ నాగయ్య, పాఠశాల ఉపాధ్యాయురాలు, బిజెపి గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పోతురాజు మస్తానయ్య మాట్లాడుతూ ప్రపంచం మెచ్చిన నాయకుడు నరేంద్ర మోడీ అని ఆయన జన్మదిన పురస్కరించుకొని ఇలా పక్షం రోజులు ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేయడం మంచి పరిణామమని వారన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టుపోగుల ఆదినారాయణ, బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాపయ్య, పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లై హమాలీలకు కూలిరేట్లు పెంపుదల చేయాలి

ఎరియర్స్ తో కలిసి జీవో విడుదల చేయాలి

సివిల్ సప్లై పాయింట్ వద్ద రెండవ రోజు నిరసన

విశాలాంధ్ర -రాజంపేట: సివిల్ సప్లై హమాలీలకు కూలిరేట్లు పెంపుదల చేసి, ఎరియర్స్ తో కలిసి జీవో విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎమ్మెస్ రాయుడు ఏఐటీయూసీ రాజంపేట పట్టణ కార్యదర్శి సికిందర్ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు బుధవారం రెండో రోజు రాజంపేట సివిల్ సప్లై పాయింట్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరరస తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూలిరేట్ల అగ్రిమెంట్ పెంపుదల 01-01-2024 నుంచి కొత్త కూలీ రేట్లను పెంచి అమలు చేయాల్సిన సివిల్ సప్లయిస్ యాజమాన్యం మరియు రాష్ట్ర ప్రభుత్వం 9 నెలల కావస్తున్నా ఎటువంటి జీవో ను విడుదల చేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. సివిల్ సప్లయిస్ యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ మూడు రోజుల పాటు ఆందోళనలు చేపడతామని తెలిపారు. అన్నమయ్య జిల్లాలో ప్రతి నెలా జీతాలు చెల్లించడంలో జిల్లా స్థాయి అధికారులు అలసత్వం కారణంగా మొదటి వారంలో జీతాలు అందడం లేదని ఆరోపించారు.రూట్ ఆప్టిమేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ హమాలీ వర్కర్స్ యూనియన్ ముఠామేస్త్రి సూరి, రాఘవేంద్ర, ప్రసాద్, కోదండరాముడు , వెంకటేష్. చౌడయ్య. ఈశ్వరయ్య , విజయ్, శ్రీను, వీరన్న, గంగయ్య, నర్సారెడ్డి రెడ్డ,తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్ పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి- సిపిఐ

విశాలాంధ్ర-రామాపురం : అక్రమ మైనింగ్ పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ రాయచోటి నియోజకవర్గంలో సిద్ధిగాల్ల శ్రీనివాసులు అన్నారు ఈ సందర్భంగా ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ గోపగుడిపల్లి గ్రామ పరిధిలో శ్రీనిధి కంకర్స్ ఆక్రమ మైనింగ్ పాల్పడుతుందని నిబంధనాలకు విరుద్ధంగా పేలుడు పదార్థాలను ఉపయోగించికొండలు గుట్టలు సైతం పేలుడు పదార్థాలను ఉపయోగించి కోట్ల విలువ చేసే సహజ సంపదను కొల్లగడుతూ వేలకోట్లు రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారని ఆయన అన్నారు దాదాపు మూడు గ్రామాల ప్రజలను గొర్రెలు మేకలు, పశువులు అడవిలో నివసించే పక్షులు పేలుడు పదార్థాల నీరు త్రాగడం వల్ల మూగజీవాలు మరణిస్తున్నాయనిమానవాళికి ఇబ్బందిని కలిగించే అనుమతులను రద్దు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ ప్రజల పక్షాన పోరాటానికి సిద్ధమవుతుందని ఆయన తెలిపారు సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని లైసెన్సులు రద్దు చేయాలని లేని పక్షంలో లేనిపక్షంలో సిపిఐ ఆందోళన చేపడుతుందని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ జిల్లా రెండవ మహాసభలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర -రాజంపేట: రాజంపేట పట్టణ కేంద్రంలో శుక్రవారం నుండి మూడు రోజులు పాటు జరిగే అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ అన్నమయ్య జిల్లా రెండవ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు మాధవ్ పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల విద్యార్థి ఉద్యమాల రథసారథి, భారతదేశ విద్యార్థి లోకానికి స్ఫూర్తిని, చైతన్యాన్ని కలిగించిన సంఘటితశక్తిగా ముందుకు నడిపించే శోధక శక్తి అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ అని బ్రిటిష్ పరాయి పాలకుల బానిస చర నుంచి మాతృభూమి విముక్తికై ఈరోజుతో స్వతంత్ర ఉద్యమంలో పొత్తులలోని పిడుగులు బిగించి స్వాతంత్రం మా జన్మ హక్కు అని చాటింది అని అన్నారు.´దేశ విద్యార్థుల్లోకాన్ని ఏకం చేసి 1936 ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లక్నో నగరంలోని బెనరస్ విశ్వవిద్యాలయంలో పుట్టి పెరిగిన శేష త్యాగాలు చేసి సుదీర్ఘ చరిత్ర కలిగిన 88 సంవత్సరాలు పూర్తి చేసుకుని 89వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అనే అన్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన విద్యార్థులకు యువకులకు వరాల జల్లులు కురిపించి నేతి బీరకాయలో నెయ్యి రుచి చూడమంటూ చెబుతున్నాయి. గత ప్రభుత్వం నాడు, నేడు అభివృద్ధి పనుల్లో ప్రజాధనాన్ని ఆర్భాటంగా ఖర్చు చేసి నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా 117 జీవోతో దాదాపు 5వేలకు పైగా ప్రాథమిక పాఠశాలను విలీనం చేసి ఉపాధ్యాయులను కుదించి తద్వారా ఏకోపాధ్యాయ పాఠశాలలు అవతరించాయి అని అన్నారు. అందువల్ల ప్రాథమిక విద్యకు విద్యార్థులు దూరం అవుతున్నారని ప్రైవేట్ విద్యాసంస్థల్లో పీజీఎంసీఏ ఎంబీఏ, ఎంకం, ఎంఎస్సీ చదువుతున్న విద్యార్థులకు జీవో నెంబర్ 77 వలన ఫీజు నెంబర్స్మెంట్ అందడం లేదు అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికల హామీలలో భాగంగా జీవో నెంబర్ను తక్షణమే రద్దుచేసి ఉన్నత చదువులు చదివేందుకు అవకాశం కల్పించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే రాజంపేట పట్టణంలో ఎస్సీ, ఎస్టీ వసతి గృహాలు అద్దె భవనాల్లో నడుపుతూ కనీస మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం జరుగుతుందన్నారు. అదేవిధంగా పట్టణంలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రైవేట్ బిల్డింగ్ లో దాదాపుగా గత కొన్ని సంవత్సరాలుగా నడుపుకుంటున్నారు. అయితే గతంలో ఆ కళాశాలకు సంబంధించి ప్రభుత్వం ఐదు ఎకరాల భూమిని కేటాయిస్తే స్కిల్ కాలేజ్ ఏర్పాటు కోసం ఆ స్థలాన్ని ప్రభుత్వం సాంక్షన్ చేయడం జరిగిందని అయితే ఈ ఐటిఐ కాలేజీకి వేరొక చోట స్థలము కేటాయించక కేటాయించిన స్థలము ఇవ్వక పక్కా బిల్డింగ్ ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులు అనేక రకాల సమస్యలు ఎదుర్కొని చదువుకోవడానికి సరైన ల్యాబ్స్ లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల కి పక్కా బిల్డింగులు ఉన్నప్పటికీ కేవలం రెండు బ్రాంచెస్ మాత్రమే నడుపుతున్నారు అయితే మరిన్ని బ్రాంచెస్ పెట్టి విద్యార్థులకు విద్య అవకాశాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి విద్యారంగ సమస్యల పైన ఈనెల 28 29 తేదీలలో ఏఐఎస్ఎఫ్ అన్నమయ్య జిల్లా మహాసభలలో విద్యారంగ సమస్యలపై చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణమే రూపొందించుకోవడం జరుగుతుంది. ఈ జిల్లా మహాసభలకు ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జుల ఈశ్వరయ్య , ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి వలరాజు ముఖ్య అతిథులుగా రావడం జరుగుతుందన్నారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ మహాసభలను విజయవంతం చేయాలన్నారు.

పాఠశాల విద్యా రంగంలో సమస్యలు పరిష్కరించాలి: యుటియఫ్ డిమాండ్

విశాలాంధ్ర -రాజంపేట: యుటియఫ్ ఆధ్వర్యంలో గురువారం రాజంపేట మండలంలోని పలు పాఠశాలలను సందర్శించి విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను గుర్తించడం జరిగింది. ప్రభుత్వాలు విద్యా రంగంలో ఏకపక్షంగా అమలుచేస్తున్న సంస్కరణల వల్ల గతంలో నెలకొన్న సమస్యలకు తోడు గా కొత్త సమస్యలు సృష్టించబడుతున్నాయి.విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన విద్యా రంగంలో అనాలోచిత తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని కోరడం జరిగింది.అనేక సమస్యలకు కారణమైన జీవో నెంబర్ 117 రద్దు చేయాలని డిమాండ్ చేయడం జరిగింది.ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుండి మినహాయించాలని కోరితే ఇంకా కొత్త కొత్త ఆన్లైన్ పనుల భారం మోపడం జరుగుతోంది.సిలబస్,పరీక్షల విధానం లోని లోపాలను సవరించాలని కోరారు. పాఠశాలల నిర్వహణకు గ్రాంట్లు మంజూరు చేయాలని కోరారు.2023లో నిర్వహించిన పదవ తరగతి పరీక్షల రెమ్యునరేషన్,2024లో కొన్ని సబ్జెక్టు ఉపాధ్యాయులకు అన్నమయ్య జిల్లాలో చెల్లించలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో విద్యారంగ సమస్యలు పరిష్కరించి ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో యుటియఫ్ అన్నమయ్య జిల్లాఅధ్యక్షుడు బి.హరి ప్రసాద్, రాష్ట్ర కౌన్సిలర్ డి.చెంగల్ రాజు, జిల్లా కార్యదర్శి పి.వెంకట సుబ్బయ్య, రాజంపేట మండల ప్రధాన కార్యదర్శి జి.నాగేంద్ర , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన అక్షయ

విశాలాంధ్ర-రాజంపేట: గురువారం కడప నగరంలోని మునిసిపల్ స్టేడియంలో జరిగిన ఎస్ జి ఎఫ్ జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ నందు రాజంపేట ఏకలవ్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీ క్రీడాకారిణి డి.అక్షయ రాష్ట్రస్థాయి టైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు మాస్టర్లు రెడ్డి ప్రవీణ్, యు.బాలాజీ గణేష్ లు తెలిపారు. అండర్-17 విభాగంలో ప్రతిభ చూపి ఎంపికైనట్లు వివరించారు. ఈ సందర్భంగా అకాడమీ కోచ్ లు మరియు సీనియర్ మాస్టర్ సునీల్ అక్షయకు అభినందనలు తెలియజేశారు.

అదుపుతప్పి మినీ లారీ బోల్తా

విశాలాంధ్ర-నందలూరు: కడప చెన్నై జాతీయ రహదారిలోని ఆల్విన్ మౌంట్ కార్మెల్ స్కూల్ వద్ద గురువారం కడప నుండి రాజంపేటకు ఎరువులోడుతో(పెస్టిసైడ్) వెళ్తున్న మినీ లారీ వెనుక టైర్ పగలడంతో అదుపుతప్పి రోడ్డుపై పడింది. ఆ సమయంలో ఎదురుగా ఏ వాహనం రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. డ్రైవర్ జిలాని భాషకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. కాసేపు ట్రాఫిక్కు అంతరాయం ఏర్పడింది.

పోలీస్ కోటర్స్ స్థలాన్ని పరిశీలించిన ఎస్ఐ

విశాలాంధ్ర - రామాపురం : మండల కేంద్రంలోని ఎంఆర్సి కార్యాలయం సమీపంలో పోలీస్ క్వార్టర్స్ కు సంబంధించిన స్థలాన్ని రామాపురం ఎస్ఐ వెంకట సుధాకర్ రెడ్డిపరిశీలించారు ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ నల్లగుట్ట పల్లి గ్రామం పొలం నందు సర్వేనెంబర్ 593 బార్ ఒకటి 0.64 సెంట్ల స్థలాన్ని పరిశీలించామన్నారు పోలీసులకు కేటాయించిన స్థలానికి కొందరు ఇటీవల ఆక్రమణ గురి చేస్తున్నారని తెలిసి ఆ తర్వాత గురవుతున్న తమకు కేటాయించిన స్థలంలో పెరిగిన కంపచెట్లు పిచ్చి మొక్కలు తొలగించి హద్దులను ఏర్పాటు చేసుకుంటున్నామని తెలిపారు త్వరలో నిధులు మంజూరు అయితే ఆ స్థలంలో పోలీస్ కోటర్స్ ను నిర్మించుకుంటామని ఆయన తెలిపారు.

ప్రతి షాపు సీసీ కెమెరాలు ఏర్పాటు : సిఐ కృష్ణంరాజు నాయక్

విశాలాంధ్ర - ఒంటిమిట్ట : ఒంటిమిట్టలో ప్రతి షాపులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఒంటిమిట్ట సిఐ కృష్ణంరాజు నాయక్ విజ్ఞప్తి చేశారు. గురువారం షాప్ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఒంటిమిట్టలో షాపుల్లో చోరీలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. అలారం మోగే సీసీ కెమెరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వాటిని ఉపయోగిస్తే దొంగలను సులభంగా పట్టుకోవచ్చు అన్నారు. రాత్రిపూట షాపుల్లో విలువైన వస్తువులు డబ్బు పెట్టకూడదన్నారు. ఒంటిమిట్ట కోదండ రామాలయం ఉండడంతో యాత్ర స్థలం కావడంతో కొత్త వ్యక్తులు ఒంటిమిట్టకు వచ్చే ఆస్కారం ఉందన్నారు. రాత్రిపూట రోడ్ల గస్తీ తిరిగే వ్యక్తులను షాపులు వారు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇటీవల ఒంటిమిట్ట బస్టాండ్ లో ఏటీఎం లో చోరీ జరిగిన విషయం అందరికి తెలిసిందేన్నారు. భవిష్యత్తులో చోరీలు జరగకుండా షాపులు వారు అప్రమత్తంగా ఉండాలన్నారు.

స్వర్ణాంధ్ర దిశగా ఏపీలో అడుగులు

విశాలాంధ్ర - ఒంటిమిట్ట : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ స్వర్ణాంధ్ర దిశగా అడుగులు ముందుకు పడుతున్నాయని ఎంపీడీవో రెడ్డయ్య పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం ఇది మంచి ప్రభుత్వం స్వచ్ఛత హి కార్యక్రమాలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాలను మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 100 రోజుల్లో అనేక సంక్షేమ కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేస్తుందన్నారు. స్వచ్ఛత హి కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు ప్రతి ఒక్కరు పరిశ్రమ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. 2047 స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యంగా అధికారులు పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో యు ఆర్ డి కుమార్ రంగయ్య తదితరులుపాల్గొని ప్రసంగించారు.

'ఇది మంచి ప్రభుత్వం' ఇంటింటి ప్రచారం

విశాలాంధ్ర- పోరుమామిళ్ల రూరల్ : మండలంలోని 59 బూత్ పరిధిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బూత్ కన్వీనర్ అన్వర్భాష పాల్గొన్నారు. ఇంటింటికి తిరుగూతు ప్రభుత్వ 100 రోజుల పాలన గురించి ప్రజలకు వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిపాలన గురించి ప్రజలకు తెలియజేస్తూ సూపర్సిక్స్ పథకాలను తెలియజేశారు. ఈకార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ కేశవరెడ్డి, వీఆర్ఓ వెంకటసుబ్బమ్మ, వెల్ఫేర్ అసిస్టెంట్ సిద్దు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రవీణ్కుమార్ పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

విశాలాంధ్ర - మైదుకూరు : మైదుకూరు లోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అక్టోబర్ 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్న దేవి నవరాత్రుల ఉత్సవాలకు హాజరు కావాలని గురువారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ హైదరాబాదులోని వారి స్వగ్రాహంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షులు సూరిశెట్టి ప్రసాద్ గుప్తా డివి సునీల్ దసరా ఉత్సవాలకు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ను గురువారం తెల్లవారుజామున హైదరాబాదులో కలిసి తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు.

ఇందిరమ్మ అక్రమ నిర్మాణపై త్వరలో కొరోడా జులిపిస్తాం

విశాలాంధ్ర-గుర్రంకొండ : ఇందిరమ్మ కాలనీలో బోగస్ పట్టాలపై నిర్మించిన నిర్మాణాలను నేలమట్టం చేస్తామని అలాగే బోగస్ పట్టాలను వెలికి తీసి చట్టపరమైన చర్యలు చేపడతామని గుర్రంకొండ తహసిల్దార్ శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఇందిరమ్మ కాలనీలో కొత్తగా నిర్మిస్తున్న ఇంటి నిర్మా ణంలో పరిశీలించి విచారించారు. చట్టపరమైన చర్యలు చేపడతా మన్నారు. ఈ కార్యక్రమంలో సచివాల సిబ్బంది వీఆర్వో అన్వర్ పాల్గొన్నారు.

ఇది మంచి ప్రభుత్వంకు విశేష స్పందన

- హాజరైన ఎమ్మెల్యే జహా,టిడిపి రాష్ట్ర కార్యదర్శి శివరాం ప్రతాప్

- అపూర్వస్వాగతం పలికిన కౌన్సిలర్ తులసి రామకృష్ణ

విశాలాంధ్ర-మదనపల్లె : పట్టణంలోని 20 వార్డు నందు పండుగ వాతావరణంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కౌన్సిలర్ పచ్చిపాల తులసి,టిడిపి సీనియర్ నాయకులు పచ్చిపాల రామకృష్ణ ఆచారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే షాజహాన్ బాషా,టిడిపి రాష్ట్ర కార్యదర్శి మరియు మదనపల్లి నియోజకవర్గం పరిశీలకులు గాజుల శివరాం ప్రతాప్ హాజరయ్యారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించి స్టిక్కర్లను అంటించారు. అనంతరం త్యాగరాజ వీధిలోని వాటర్ ప్లాంట్ వద్ద టిడిపి జెండాను ఆవిష్కరించారు. ముందుగా వారికి తులసి రామకృష్ణ,వార్డులోని మహిళలు హారతులిచ్చి, పూలమాలలతోఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన వంద రోజుల పాలనను అద్భుతంగా చేశారని,ఏపీలో నిర్వీరమైన ఆర్థిక వ్యవస్థను తాజ్ గాడిన పెట్టి,ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నారని కొనియాడారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల శివరాం ప్రతాప్ మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు, మద నపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే షాజహాన్ బాషా సమర్థవంతంగా పనిచేస్తున్నారని కితాబుచ్చారు. షాజహాన్ బాషా ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి,వారి శ్రేయస్సుకోసం పరితపిస్తున్నారని కొనియాడారు. కూటమి వంద రోజుల పాలనకు ప్రజలు వంద మార్కులు వేశారని,మున్ముందు మరింత మంచి పాలన చూడబోతున్నారని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో వార్డు పరిధిలోని టిడిపి నాయకులు తాజ్ బాషా,ఆర్.కృష్ణమూర్తి, ముద్దు, కిరణ్,మురళి,రంగా,వెంకటే ష్, రమణ, ఇడ్లి రాజు,ఫ్యాన్సీ కృష్ణ మూర్తి, శీనా, ఆంజి,శంకర, కార్తీక్, సుబ్బరాజు,తారక గుర్రప్పనాయుడు, రామ్మూర్తి నాయుడు,డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి, ఎస్.ఏ. మస్తాన్, ఎస్.ఎం.రఫీ,పఠాన్ ఖాదర్ ఖాన్,నాగార్జున బాబు,ప్రభాకర్, బావాజాన్,జేసీబి మధుసూదన్ రెడ్డి,జేసిబీ వేణు,దుబ్బిగాళ్ల భాస్కర్,చంద్రశేఖర్, దాదు ఖాన్,సంగం రమేష్,మాజీ కౌన్సిలర్లు పులి మహాలక్ష్మి,రాధమ్మ,శ్యామలమ్మ పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలు మెచ్చిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వం

తంబళ్లపల్లి ఇంచార్జీదాసరిపల్లి జయచంద్రారెడ్డి

విశాలాంధ్ర-బి.కొత్తకోట : తంబాలపల్లి తాలూకా బి కొత్తకోట మండలం బడి కాయలపల్లి గ్రామ పంచాయతీ గురు వారం 'ఇది మంచి ప్రభుత్వం' అనే కార్య క్రమంలో జరిగిన గ్రామ సభకు ముఖ్య అతిథిలుగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ జిల్లా టిడిపి అధ్యక్షులు జగన్మోహన్ రాజు పాల్గొన్నారు. వారికి కూటమి నాయ కులు తంబళ్ళపల్లి తెలుగుదేశం ఇన్చార్జి దాసిరపల్లి జయచంద్రరెడ్డి దాదంలోక నాథ్ రెడ్డి శివరామిరెడ్డిలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బడికాయల పల్లి పాఠశాలలో ఏర్పాటుచేసిన మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. అనంతరం బడికాయలపల్లి నడిబొడ్డున నిర్వహించిన ప్రజా కార్య క్రమంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఇది మంచి ప్రభుత్వం ఎందుకంటే సంక్షోభం లోనూ సంక్షేమం అందించి,అభివృద్ధికి రెక్కలు తొడిగిందన్నారు. ఈ కార్య క్రమంలో రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ పర్వీన్ తాజ. మాజీ సర్పంచ్ కుడుం శ్రీనివాసులు. మున్సిపల్ కమిషనర్ పల్లవి ఏవో రామా దేవి ఎంపీడీవో శంకరయ్య ఏపీఎం మురళి రాజేశ్వరి ఎంఈఓలు రెడ్డి శేఖర్ భీమేశ్వరరావు నాయకులు దేరంగుల ఓబులేసు దేరంగుల నారాయణ సంగు రామచంద్ర ఆది మాజీ విఆర్ఓ వెంకటరమణ రవి దుర్గారెడ్డి సుబ్బన్న జయ చంద్రారెడ్డి శేఖర్ జగన్మోహన్ రెడ్డి సంతోష్ రెడ్డి మారప్ప కృష్ణమూర్తి చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో రెవెన్యూ అధికారులు సూచిక బోర్డు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-పీలేరు : కె.వి పల్లి మండలంలో ప్రభుత్వ భూములు యదేచ్ఛగా కబ్జాలకు గురైతున్నాయని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి టిఎల్ వెంకటేష్ అన్నారు. ఆయన కె.వి పల్లి మండలంలో ఎమ్మెల్యే పర్యటనకు వచ్చిన సందర్భంగా స్థానిక లిఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డిని కలిసి గత తాసిల్దార్ నరసింహులును సస్పెండ్ చేయాలని కోరారన్నారు. ఆయన కూడా సానుకూలంగా స్పందించడం జరిగిం దన్నారు. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి టిఎల్ వెంకటేష్ మాట్లా డుతూ ప్రభుత్వ భూములలో రెవిన్యూ అధికారులు సూచిక బోర్డు ఏర్పాటు చేయకపోవడంతో గార్ని మిట్ట గ్రామపంచాయతీ తోపాటు కె.వి పల్లి తితా వగుంటపల్లి మఠంపల్లి గ్రామపంచాయతీలలో ప్రభుత్వ భూములను యదేచ్ఛగా బడా బాబులు ఆక్రమించుకుని కొన్ని గ్రామాలలో కాంప్లెక్స్ లు కట్టుకొని మిగిలిన గ్రామాలలో ప్రహరీ కంచులేసుకుని ఏ ప్రభుత్వం వస్తే ఆ ప్రభుత్వం మాది అనే చందంగా వ్యవహరిస్తున్నారన్నారు కొంతమంది అవినీతి రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం తోనే దళారులు, భూ కబ్జాదారులు రెచ్చిపోతున్నారు అన్నారు రెవెన్యూ అధికారులు సూచిక బోర్డు ప్రభుత్వ భూముల్లో ఏర్పాటు చేయకపోవడంతో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయన్నారు. కంచే చేను వేసినట్టు అనే చందంగాలి అక్రమార్కులకు రెవిన్యూ అధికారులు దాసోహం అయిపోతే సామాన్యులకు నష్టం వాటిల్లక తప్పదు అన్నారు. గత తహసిల్దార్ నరసింహులు తప్పిదం వల్లే దళితులు ఇబ్బందులు పాలవయ్యారని వారు ఇల్లులు కట్టుకొని మోసపోయారన్నారు వారికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి పునరావాసం కింద పక్క ఇల్లు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు దళితులు ఇబ్బందులకు గురువ్వడానికి కారణమైన గత తహసిల్దార్ గారిని సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు.

మాటల ప్రభుత్వం కాదు ఇది మంచి ప్రభుత్వం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు డు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాద ని, ఇచ్చిన మాట ప్రకారం హామీలు నెరవేర్చే ప్రభు త్వమని కమలా పురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఎన్డీయే కూటమి వందరోజుల పాలనపై రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని కమలాపురం నియోజకవర్గంలోని చింతకొమ్మదిన్నె మండలం కులుముల పల్లెలో ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు నాయ కత్వంలో వంద రోజుల్లో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరించి, 'ఇది మంచి ప్రభుత్వం' స్టిక్కర్లను అంటించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ చాంద్ బాషా, తహసిల్దార్ నాగేశ్వరరావు, ఇంచార్జ్ ఎంపీడీవో శ్రీధర్, మండల వ్యవసాయ అధికారి మండల విద్యాశాఖఈశ్వర్ రెడ్డి, అధికా రులు వెంకట్రామిరెడ్డి, రమాదేవి, సీఐ శివశంకర్ నాయక్, మండల కన్వీనర్ టీవీ.కృష్ణారెడ్డి, మోహన్ నజీర్ బాబు, సర్పంచ్ సుబ్బరాయుడు, మాజీ సర్పంచ్ మహేందర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

విశాలాంధ్ర- పీలేరు :అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందిన సంఘటన గురువారం పీలేరు మండలంలో చోటు చేసుకుంది. పీలేరు అర్బన్ ఎస్సై బాలకృష్ణ కథనం మేరకు... వివరాలు....మండలంలోని బోడుమల్లు వారిపల్లె పంచాయతీ. మొరవపల్లె చెరువులో మహిళ మృతదేహం తేలియాడుతున్నట్లు స్థానికులు సమాచారం అందించారు. పీలేరు అగ్నిమాపక సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పారిశుద్ధ్య కార్మికుడి సహాయంతో మృతదేహాన్ని వెలికితీశారు. మృతదేహం బాగా కుళ్లిని స్థితిలో ఉండడంతో పరిసర ప్రాంతాల్లో ఆరా తీయడంతో మృతురాలు అచూకీ లభ్యమైంది. స్థానికంగా ఇటుకల బట్టీలో పనిచేసే తమిళనాడుకు చెందిన మణి భార్యసాయిసుదా (25) గుర్తించారు. వీరు గత మంగళవారం రాత్రి భార్యభర్త గొడవ పడ్డారు. అప్పటి నుంచి భార్య కనబడకుండా పోయిందని మణి చెప్పాడు. మృతురాలుకి స్నేహ, క్రిష్ణదేవ ఇద్దరు పిల్లలున్నారు. నడుముకు రాయి. కట్టుకుని నీళ్లలోకి దూకి ఆత్మహత్య చేసుకుందా...? లేదా ఎవరైనా హత్యచేసి రాయికట్టి చెరువులో పడేశారా..? అన్న కోణంలో విచారణ జరుపుతామని ఎస్సై తెలిపారు. మృదేహాన్ని శవపరీక్షనిమిత్తంప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రైతులకు ఉలవలు పంపిణి చేసిన టీడీపీ నేతలు

విశాలాంధ్ర- పీలేరు : ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలోఎర్రగుంట్ల పల్లి గ్రామంలో రైతులకు వులవలను ఎర్రగుంట్ల పల్లి తెలుగుదేశం నాయకుడు ఎం. అమరనాధ రెడ్డి, దేవలపల్లి రమణ రెడ్డి దేవులపల్లి గోవర్ధన్ రెడ్డిలు పంపిణి చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నేత అమరనాధ రెడ్డి మాటలాడుతు తమ అధినాయకుడు సీఎం. చంద్రబాబు నాయుడు నేతృత్వం లో 100 రోజులు పూర్తియినా సందర్భంగా పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పలు అభిరుద్ది కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మరాజు,ఎల్లప్ప వేముల ప్రసాద్ మాజీ సర్పంచ్ దేవమ్మ నెట్టిబండ రమేష్ మణి సార్ రామాంజులు కప్పరం చంద్రయ్యలు పాల్గొన్నారు.

చైతన్య యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర–కడప రూరల్ : కడప నగరంలోని కోటిరెడ్డి సర్కిల్ వద్ద ఉన్న శ్రీ చైతన్య బ్రాంచ్ నందు ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతున్న అల్తాఫ్ అనే విద్యార్థిని పరీక్షల్లో మార్కులు తక్కువ వచ్చాయని గురువారం లెక్చరర్ విచక్షణ రహితంగా కొట్టడం జరిగింది. ఇలా విచక్షణ రహితంగా కొట్టిన లెక్చరర్ మరియు శ్రీ చైతన్య యాజమాన్యంపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ కడప నగర అధ్యక్ష సహాయ కార్యదర్శులు అఖి రానందన్, చంద్రలు డిమాండ్ చేశారు. కేవలం రంగులు హంగులు ఆర్భాటాల కేటగిరీల విధానంలో ఫీజులు వసూలు చేసే ఇలాంటి విద్యా సంస్థలు విద్యార్థుల యొక్క ప్రతిభను బట్టి కూడా కేటగిరీలుగా విద్యార్థులకు అర్థమయ్యేలా విభజించి బోధన చేయాలి కానీ అలా చేయకుండా విద్యార్థిని కొట్టడం ఎంత మాత్రం సమంజసం కాదని వారు ఎద్దేవ చేశారు. కడప ఆర్ఐఓ వెంటనే ఈ విషయంపై స్పందించి ఆ సంస్థపై కఠినమైన చర్యలు తీసుకొని వాటి లైసెన్సులను రద్దు చేయాలి, లేని పక్షాన అఖిల భారత విద్యార్థి సమాఖ్య విద్యార్థికి న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర ఉపాధ్యక్షులు అశోక్, ఫహద్ కోశాధికారి రాజేష్, నాయకులు గణేష్, ప్రశాంత్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

కాలువ పూడిక పనులను పరిశీలించిన కమీషనర్

విశాలాంధ్ర – ప్రొద్దుటూరు: పట్టణంలోని స్థానిక గోపి రైస్ మిల్ రోడ్డు నందు కాలువల పూడిక పనులను మున్సిపల్ కమీషనర్ రఘునాథ రెడ్డి పరిశీలించారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి ఎప్పటికప్పుడు పూడిక తీత పనులను చేస్తా మని తెలిపారు. ప్రస్తుతం వర్షాకాలం కావున డ్రైనేజిలను పరిశీలించడం జరుగుతుం దని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో శానిటరీ ఇన్స్పెక్టర్ సుబ్బరాయుడు, మేస్త్రి బిజయ్య తదితరులు పాల్గొన్నారు.

దొండ్లవాగులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం

విశాలాంధ్ర–లింగాల: లింగాల మండల దొండ్లవాగు గ్రామంలో గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టీడీపీ సీనియర్ నాయకుడు దేవిరెడ్డి సంజీవరెడ్డి, మాట్లాడుతూ ఎన్డీయే అధికారం చేపట్టిన వంద రోజులలోనే ఇచ్చిన హామీలను నెరవేర్చిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వంద రజుల పాలనకు రాష్ట్ర వ్యాంగా ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. ఎన్డీఏ ప్రభు త్వం ప్రవేశ పెట్టి సంక్షేమ పథకాలను ఆయన ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లోకేశ్వరరావు, తహశీల్దారు ఈశరయ్య, ఎస్ఐ మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

స్వచ్ఛతాహీ సేవపై అవగాహన

విశాలాంధ్ర–వేంపల్లి: స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా స్థానిక వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పట్టణంలోని గరుగు వీధిలో పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ఓబుల్ రెడ్డి , వాలంటీర్లు వీధులలోని దాదాపు 400 గృహాలకు వెళ్లి ప్రతి ఇంటికి ప్రస్తుతము విస్తరిస్తున్న చికెన్ గునియా,డెంగ్యూ వ్యాధుల కారణాలు వాటి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేసి ప్రజలను అప్రమత్తం చేశారు.

పేదలకు భూములను పంచాలని

1న బద్వేలులో భారీ ప్రదర్శన, బహిరంగ సభ

రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ రాక: వైఎస్ఆర్ కడపజిల్లా సీపీఐ కార్యదర్శి గాలిచంద్ర

విశాలాంధ్ర–కడప రూరల్ : జిల్లాలో విలువైన ప్రభుత్వ భూములను ఆక్రమించి అమ్ముకుని సొమ్ముచేసుకుంటున్న భూమాఫియా అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని, అరికట్టాల్సిన తహసిల్దార్లు కబ్జాదారుల కొమ్ముకాస్తున్నారని భూ అక్రమాలపై చర్యలు తీసుకొని అర్హులైన పేదలకు పంచాలని అక్టోబర్ 1న బద్వేలులో భారీ ప్రదర్శన బహిరంగ సభ జయప్రదం చేయాలని ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ , రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఓబులేసు, జి.ఈశ్వరయ్య హాజరవుతారని గురువారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగిన సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన పేదలకు రెండు సెంట్ల ఇంటిస్థలం, రెండెకరాల సాగు భూమి పంచడానికి నిరాకరిస్తున్న అధికారులు, అధికారపార్టీ ప్రజా ప్రతినిధులు రెవిన్యూ రికార్డుల ఆధారంగా విలువైన ప్రభుత్వ వంక, వాగు, చెరువు, రస్తా, దేవాదాయ, భూదాన, ఇనాం, వక్ఫ్, అసైన్మెంట్ భూములపై తప్పుడు పత్రాలను సృష్టించి ఆక్రమించి అమ్ముకుని సొమ్ముచేసుకుంటున్నారని వారు తీవ్రంగా విమర్శించారు. భూముల ఆన్లైన్ విధానం వచ్చిన తరువాత రైతులకు అధికారుల చుట్టూ తిరిగే తిప్పలు తగ్గుతాయిని అనుకున్నప్పటికీ అధికారుల వైఖరి వల్ల తిప్పలు రెట్టింపు అయ్యాయన్నారు. భూముల ఆన్లైన్ పేరుతో ఒకరి భూమి మరొకరికి నమోదు చేసి సరిదిద్దాలంటే సదరు రైతు వచ్చి వ్రాతపూర్వకంగా ఒప్పుకున్న తరువాతనే భూమి నమోదులో తప్పులను సరిదిద్దుతామని చివరకు భూమి విలువను బట్టి మామూళ్ళు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. ఆన్లైన్ నమోదులో ఉద్దేశపూర్వకంగానే తప్పులు చేసి అడ్డగోలుగా దొరికిపోయి చివరికి రాష్ట్ర స్థాయి అధికారుల ఆదేశాలతో సస్పెండ్ అయ్యిన తహసిల్దార్లను తిరిగి అదేస్థానంలో తీసుకు వచ్చేందుకు కూడా ఎమ్మెల్యేలు వెనకాడడం లేదంటే ఎంత పెద్దఎత్తునా భూదందా నడుస్తున్నదో అర్థమవుతుందన్నారు. కొంత మంది తహసిల్దార్లు, పోలీసులు అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటూ కోట్లు గడిస్తున్నారని ఈక్రమంలో సామాన్యులను ఇబ్బంది పెడుతు న్నారన్నారు. జిల్లాలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇబ్బడి ముబ్బడిగా లేఔట్లు వెలుస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారన్నారు. ఒక లేఔట్ వేయాలంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం నూటికి నలభై శాతం భూమి రోడ్లు, కాలువలు, పార్కు, పాఠశాలలు, కమ్యూనిటీ డెవలప్మెం ట్కు కేటాయించాలని అందుకు ముందుగా ల్యాండ్ కన్వర్షన్కు రెవిన్యూకు డబ్బుచెల్లించి దరకాస్తు చేసుకుంటే భూమి స్వభావాన్ని మార్చే క్రమంలో సదరు భూమి మునకకు గురవు తుందా లేక పర్యావరణ సమతుల్యతకు ముప్పు వాటిల్లుతుందా వంటి విషయాలను పరిగణలోకి తీసుకోకుండా అడ్డగోలుగా అనుమతులి స్తున్నారని ఫలితంగా చిన్నపాటి వర్షాలకే మునకకు గురవుతున్నాయని, అనుమతుల్లేని నిర్మాణాల పేరుతో భారీగా పన్నుల భారం ప్రజలపై పడుతుందని అన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు బి రామయ్య, ఎన్ వెంకట శివ, పి చంద్రశేఖర్, సి సుబ్రమణ్యం, ఎంవి సుబ్బారెడ్డి, వేణుగోపాల్ కే.సిబాదుల్లా వి గంగా సురేష్ పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతపై దృష్టి సారించాలి: కమిషనరు

విశాలాంధ్ర–పులివెందుల: విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతపై దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనరు రాముడు పేర్కొన్నా రు. సార్డ్స్ (సోషల్ యాక్టివి టీస్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ), గ్రామాలయ సంయుక్త ఆధ్వర్యంలో“ డెటాల్ బనేగా స్వస్థ్ ఇండియా” ప్రాజెక్ట్ లో భాగంగా పులివెందుల లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (అహోబిలపురం మెయిన్) నందు ఏర్పాటు చేసిన “ హైజిన్ కార్నర్ “ను పులివెందుల మున్సిపల్ కమిషనర్ రాముడు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా సార్డ్స్ ఎన్జీఓ ఆధ్వర్యంలో హైజిన్ కార్నర్ ఏర్పాటు చేయడం చాలా సంతోషించదగ్గ విషయం అని, ప్రతీ రోజూ భోజనానికి ముందు, టాయిలెట్ కి తర్వాత సబ్బుతో చేతులు కాళ్ళు శుభ్రం చేసుకోవాలి. చేతులు శుభ్ర పరచే ఏడు రకాల విధానాలు తెలియసేశారు. ప్రతీ ఒక్కరూ పాఠశాలను తమ పాఠశాల గా భావించి విద్యార్థులను తమ పిల్లలుగా భావించాలని, వారి ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరుపుతుండాలనీ, పాఠశాలలలో స్వచ్ఛతా కార్యక్రమం నిరంతరం అమలయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసుల రెడ్డి, డి బి ఎస్ ఐ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ విష్ణు వర్ధన్, వాలంటీర్ లు రహమతున్నీష,ఈశ్వరయ్య, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు .

వేముల సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో తిష్ట వేసిన సమస్యలు

విశాలాంధ్ర – వేముల : వేముల సాంఘిక సంక్షేమ హాస్టల్లో దాదాపుగా సంవత్సర కాలం నుండి సమస్యలు తిష్ట వేశాయి. అయితే వాటిని పరిష్కరించి విద్యార్థులకు ఎలాంటి ఆ సౌకర్యాలు లేకుండా చేయాల్సిన వార్డెన్ నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం శోచనీయం. గత ఏడాదిలో ఈ సమస్యల మీద విశాలాంధ్ర రిపోర్టర్ హాస్టల్ వార్డెన్ ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లగా కంటిచూపు చర్యగా స్నానాలు చేసే చోట బ్లీచింగ్ పౌడర్ వేసి శు భ్రపరిచారు. తరువాత వాటిని అలానే వదిలి వేశారు. విద్యార్థుల కోసం కేటాయించిన స్నానపు గదులు మరుగు దొడ్లు చాలా అధ్వానంగా తయారయ్యాయి. కనీసం వాటిని శుభ్రం చేసేదాని కూడా సమయం లేదు. విద్యార్థులు ఆరు బయటకి వెళ్లి తమ కాలకృత్యాలను తీర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడినది. అటు తెల్లవారుజామున ఇటు చీకటిలో బయటికి వెళ్లాల్సిన పరిస్థితి. హాస్టల్ చుట్టూ పంట పొలాలు పిచ్చి మొక్కలు ఉండడం వల్ల ఎప్పుడు ఎలాంటి విష సర్పాలు వస్తాయి అని విద్యార్థులు బిక్కుబిక్కు మం టూ గడుపు తున్నారు. కావున ఉన్నత అధికారులు స్పందించి తమకు మెరుగైన సౌకర్యాల ను అందించా లని సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థులు కోరుకుంటు న్నారు. అంతేకాక పూర్వ విద్యార్థు లు తమ హాస్టల్ లోకి వచ్చి తమపై పెత్తనం ఎలా ఇస్తు న్నారని వార్డెన్ కానీ అక్కడ ఉన్నటువంటి ఇతర సిబ్బంది వారిని అదుపు చేయలేకున్నా రని దీనివల్ల వారు ఎప్పుడు ఏమి చేస్తారో తెలియని పరిస్థి తి. అందువల్ల వారికి ఎదురు చెప్పకుండా అనిగిమనిగి ఉండాల్సిన పరిస్థితి నెలకొన్నది అని వారిని హాస్టల్ సిబ్బంది ప్రోత్సహించడం వల్లనే వారు చదువు అయిపోయినా కూడా ఇక్కడే తిష్ట వేశారని వారు తెలియజేశారు. కావున ఉన్నతాధికారులు కలగజేసుకుని తమ సమస్యలన్నిటిని పరిష్కరించవల సిందిగా విద్యార్థులు కోరుతున్నారు.

సివిల్ సప్లై హమాలీలకు కూలిరేట్లు పెంచాలి

విశాలాంధ్ర–రాయచోటి : సివిల్ సప్లై హమాలీలకు కూలిరేట్లు పెంపుదల చేసి, ఎరియర్స్ తో కలిసి జీవో విడుదల చేయాలని సివిల్ సప్లయిస్ హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కృష్ణయ్య డిమాండ్ చేశారు. సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు రెండవ రోజు గురువారం రాయచోటి సివిల్ సప్లై పాయింట్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యం లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ కూలిరేట్ల అగ్రిమెంట్ పెంపుదల 01-01-2024 నుంచి కొత్త కూలీ రేట్లను పెంచి అమలు చేయాల్సిన సివిల్ సప్ల యిస్ యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం 9 నెలల కావస్తున్నా ఎటువంటి జీవోను విడుదల చేయకుండా కాల యాపన చేస్తున్నారని విమర్శించారు. సివిల్ సప్లయిస్ యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ మూడు రోజుల పాటు ఆందోళనలు చేపడతా మని తెలిపారు. అన్నమయ్య జిల్లాలో ప్రతి నెలా జీతాలు చెల్లించడంలో జిల్లా స్థాయి అధికారులు అలసత్వం కారణంగా మొదటి వారంలో జీతాలు అందడం లేదని ఆరోపించారు. రూట్ అఫ్లిమేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంపత్ కుమార్, రాంప్రసాద్, చిన్నప్ప, ఆంజినేయులు, వెంకటేష్, రామకృష్ణ, శ్రీనివాసులు, వెంకట నర్సింహులు, శంకరా, తదితరులు పాల్గొన్నారు.